PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 82 | పేజీలు : 8 | మంగళవారం18 ఆగస్టు 2026 | వెల : 4/-




## మంత్రివర్గ రేసులో ఆ ముగ్గురు!

- బీజేపీ కొత్త జాతీయ కమిటీలో కె.లక్ష్మణ్, డీకే అరుణకు దక్కని చోటు
- కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో తెలంగాణ నుంచి ఒకరిద్దరికి పదవులు లభిస్తాయని ప్రచారం
- రేసులో ఈటల, ధర్మపురి అర్వింద్, గోడెం నగేశ్ పేర్లు ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ



న్యూఢిల్లీ

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సోమువారం ప్రకటించిన కొత్త జాతీయ కార్యవర్గం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జాతీయ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో జరిపిన ఈ మార్పుచేర్పుల్లో జాతీయ ఓబీసీ మోర్చా - మిగతా3లో



## పంద్రాగస్టు వేళ భారీ ఐఎస్ఐ నెట్‌వర్క్‌ను తుడిచిపెట్టాం

- 200 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్ట్ చేశాం
- అమిత్ షా కీలక ప్రకటన
- దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- ఐఎస్ఐ మద్దతు గల షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసినట్లు ప్రకటన
- తద్వారా విధ్వంసర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు వెల్లడి

# విద్య, వైద్యానికి ప్రాధాన్యం

- పదేళ్లలో పేదల ఆస్పత్రులు కట్టలేదేం?
- కూలిపోయే స్థితిలో ఉన్న ఉస్మానియాను నిర్వీర్యం చేశారు
- సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లలో ఆస్పత్రుల నిర్మాణం మర్చిపోయారు
- వరంగల్‌లో పెద్ద మాటలు చెప్పి ఉన్న ఆస్పత్రిని కూల్చేశారు
- సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం



హైదరాబాద్

'కూలిపోయే పరిస్థితిలో ఉన్న వందేళ్ల నాటి ఉస్మానియా ఆస్పత్రిని తిరిగి నిర్మించాలని పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఆలోచన చేయలేదు. సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లలో కొత్త ఆస్పత్రులకు టెంకాయ కొట్టి వాటి నిర్మాణం మర్చిపోయారు. వరంగల్‌లో పెద్ద మాటలు చెప్పి ఉన్న ఆసుపత్రిని కూల్చేశారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే వాళ్ల పార్టీ నాయకుడిని తీసుకొచ్చి ఇక్కడ (టిమ్స్ ఆస్పత్రి) కలియ దిరిగారు. దీన్ని మేం కట్టాం.. రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నాడన్నారు. నువ్వు నిజంగా కడితే రిబ్బన్ కట్ చేయడానికి పదేళ్లలో సమయం దొరకలేదా? కేసీఆర్ నాకు సాయం చేసినా - మిగతా3లో



## బీజేపీ నూతన జాతీయ కార్యవర్గం

- పురందేశ్వరికి ఉపాధ్యక్ష పదవి
- ప్రధాన కార్యదర్శులుగా 8 మంది
- బీజేపీ జాతీయ నూతన కార్యవర్గం ప్రకటించిన నితిన్ నబీన్
- 13 మందికి బీజేపీ ఉపాధ్యక్ష పదవులు
- 8 మందికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవులు



## త్వరలోనే ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలో భారత్ స్వయం సమృద్ధి

- అశ్విని వైష్ణవ్ కీలక వ్యాఖ్యలు
- కీలక ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్లలో స్వయం సమృద్ధి సాధిస్తున్న భారత్
- ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్ చైనాకు ఎగుమతి చేస్తున్న భారత పరిశ్రమలు
- ఎన్‌క్లోజర్లు, ఆప్టికల్ ట్రాన్స్‌సీవర్స్, ఆనోడ్ మెటీరియల్స్‌లోనూ ఆత్మనిర్భరత

# 'సర్' ముసాయిదా జాబితా విడుదల



- సర్ డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి
- 92 లక్షల మందికి నోటీసులు ఇస్తామని వెల్లడి
- నోటీసులు అందుకున్నవారు సమాధానం ఇచ్చేందుకు సెప్టెంబర్ 16 తుదిగడువు
- 60 లక్షల అనామలీస్‌తో పాటు 32 లక్షల నోమ్యాపింగ్ ఓట్లకు నోటీసు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ముసాయిదా జాబితా విడుదలైంది. బీఎల్‌వోలు డిజిటలైజ్ చేసిన సమాచారం ఆధారంగా ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. 2కోట్ల 64 లక్షల 87వేల ఓట్లను ముసాయిదాలో పొందుపర్చారు. ఇది 78.30శాతంగా ఉంది. ఇందులో 92లక్షల మందికి నోటీసులిస్తామని సీఈవో(ఎన్నికల ప్రధానాధికారి) సుదర్శన్ రెడ్డి తెలిపారు. 60 లక్షల అనామలీస్‌తో పాటు 32 లక్షల నోమ్యాపింగ్ ఓట్లకు నోటీసులివ్వనున్నారు. నోటీసు ప్రక్రియ నెల రోజు పాటు కొనసాగుతుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఆ తర్వాత మరో నెల పాటు అభ్యంతరాలు, వివరణలు తీసుకుంటారు. ప్రక్రియ అంతా ముగిశాక తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణలో భాగంగా మరో ప్రక్రియ మొదలైంది. జూన్ 25 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణలో బీఎల్ఓలు 3.38 కోట్ల ఎన్యుమరేషన్ పత్రాలను అందించారు. అందులో తిరిగి 2.64 కోట్లకు పైగా ఫారాలు తిరిగి రావడంతో బీఎల్ఓలు వాటిని డిజిటలైజ్ చేశారు. 73లక్షలకు పైగా ఓట్లు తగ్గిపోయాయి. ఇందులో అబ్సెంట్, షిఫ్టింగ్, డెత్, డూప్లికేట్) వంటి కారణాలతో పత్రాలు రాలేదు. వీటి మొత్తం 21.70శాతంగా ఉంది. ఇందులో చనిపోయిన వాళ్లు 9లక్షల 22వేల 229 పర్మినెంట్లీ - మిగతా3లో



## నిషేధిత భూములపై టోల్‌ఫ్రీ

- 22(ఏ) భూముల అప్‌డేట్‌లో పొరపాటు
- అధికారుల తరపున క్షమాపణలు కోరిన మంత్రి పొంగులేటి
- ప్రైవేటు ఆస్తులను 22(ఏ) నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని హామీ
- 22(ఏ) జాబితా ఫిర్యాదుల పరిష్కారం కోసం 18005994788 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు



## అణు ప్రమాదంలో న్యాయమైన పరిహారం ఇవ్వకుండా ఆ చట్టం కోర్టులను నిరోధిస్తుందా?

- ఈ చట్టం కింద ఏర్పాటు చేసే నియంత్రణ మండలిలో సభ్యులను నియమించే ప్రక్రియలో ఎలాంటి ప్రయోజనాల సంఘర్షణ లేదనే విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆదేశం



## 2014 నుంచి నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు

- ఝార్ఖండ్ సర్కార్ సంచలన నిర్ణయం
- 2014 నుంచి జరిగిన అన్ని పరీక్షలపై సమగ్ర విచారణకు ఆదేశం
- అన్ని పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపిక చేసిన అభ్యర్థుల లిస్టు సహా ఆ సంస్థకు సంబంధించిన ప్రతిదానినీ రద్దు
- కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టానికి చేసిన సవరణలపై చర్చించడానికి త్వరలో సమావేశమవుతాం.

నవగీతం
తెలుగు దినపత్రిక
మంగళవారం
18 ఆగస్టు 2026

## త్వరలోనే ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలో

# భారత్ స్వయం సమృద్ధి

భారతదేశ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం సరికొత్త చరిత్ర దిశగా అడుగులేస్తోంది. ఇప్పటివరకు కేవలం స్మార్ట్‌ఫోన్లు, టీవీలు వంటి ఉత్పత్తుల్ని అసెంబుల్ చేయడానికి పరిమితమైన భారత్, ఇప్పుడు ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు, ముడి పదార్థాల తయారీలోనూ వేగంగా స్వయం సమృద్ధి సాధిస్తోంది. తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచుకుంటోంది. కీలక ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీతో దేశీయ అవసరాల్ని దాదాపు పూర్తిగా తీర్చే స్థాయికి భారత్ చేరుకుంటోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అనేక ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో 100 శాతం ఆత్మనిర్భరత సాధించిందని లేదా పూర్తి స్వయం సమృద్ధికి అత్యంత చేరువలో ఉందని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (జుజమీా) కింద 5వ విడత అనుమతుల మంజూరు కార్యక్రమంలో మంత్రి - పరిశ్రమ ప్రతినిధుల్ని ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీలో స్థానిక విలువను పెంచడం, కీలక కాంపోనెంట్ల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, అధునాతన తయారీ సామర్థ్యాల్ని అభివృద్ధి చేయడం ఈ జుజమీా పథకం ప్రధాన లక్ష్యాలు.

దేశ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థ గతంతో పోలిస్తే గణనీయంగా విస్తరించిందని ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఎన్‌క్లోజర్లు, రిలేలు, ఆప్టికల్ ట్రాన్స్‌సీవర్స్, ఆనోడ్ మెటీరియల్ రంగాల్లో భారత్ 100 శాతం స్వదేశీ సామర్థ్యాన్ని సాధించిందని, వాటిని ఇంకా ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందని తెలిపారు. ముఖ్యంగా తయారీ రంగానికి ప్రధాన కేంద్రంగా ఉన్న చైనాకు కూడా భారత్ నుంచి పీసీబీల (ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్) ఎగుమతులు ప్రారంభం కావడం అభినందించదగిన విషయమని కొనియాడారు. అశ్విని వైష్ణవ్ వెల్లడించిన



వివరాల ప్రకారం, లామినేట్లలో 80 శాతం డిమాండ్‌ను స్వదేశీ తయారీ ద్వారానే భారత్ తీర్చుకుంటోంది. ప్రస్తుత విస్తరణతో త్వరలోనే ఇందులోనూ 100 శాతం ఆత్మనిర్భరత సాధించనున్నాం. ఆప్టికల్ కనెక్టర్లకు సంబంధించి దేశీయ డిమాండ్‌లో 75 శాతం సాధించాం. గతంలో భారత్‌లో అసలు తయారు చేయలేని స్థితి నుంచి ప్రస్తుతం దేశ అవసరాల్లో 60 శాతం లిథియన్ అయాన్ సెల్స్‌ను దేశీయంగా తీర్చే స్థాయికి భారత్ చేరుకుంది. ఇతర కాంపోనెంట్ల విషయానికి వస్తే ట్రాన్స్‌డ్యూసర్లలో 55 శాతం, ఎలక్ట్రానిక్స్‌కు అవసరమైన పర్మనెంట్ మ్యాగ్నెట్లలో 40 శాతం, కెపాసిటర్లలో 20 శాతం దేశీయ సామర్థ్యం సాధించినట్లు కేంద్ర మంత్రి వివరించారు.

**106 ప్రాజెక్టులు- 74 వేలకుపైగా ఉద్యోగాలు**

విడిభాగాలు, ముడి సరకుల తర్వాత ఎలక్ట్రానిక్స్ రంగానికి అవసరమయ్యే 'క్యాపిటల్ ఎక్విప్‌మెంట్ (యంత్రాలు, తయారీ పరికరాలు)' స్వదేశంలోనే తయారు చేయడం తదుపరి లక్ష్యమని మంత్రి అశ్విని వైష్ణవ్ నొక్కిచెప్పారు. సోమవారం రోజు దేశీయ క్యాపిటల్ ఎక్విప్‌మెంట్ తయారీకి సంబంధించి 2 కంపెనీలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల పథకం జుజమీా కింద కేంద్రం తాజాగా రూ. 7877 కోట్లతో 31 కొత్త ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పటివరకు ఆమోదం పొందిన ప్రాజెక్టుల సంఖ్య 106కు చేరగా, వీటి మొత్తం పెట్టుబడులు రూ. 69 వేల కోట్లు దాటాయి. వీటిల్లో 38 ప్రాజెక్టులు ఇప్పటికే ఉత్పత్తిని ప్రారంభించాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. మరో 16 నిర్మాణంలో ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఇక దీని ద్వారా ఇప్పటివరకు 74 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు, దాదాపు 2.5 లక్షల పరోక్ష ఉద్యోగాలు లభించాయని తెలిపారు.

**పరిశ్రమ ముందు 4 ప్రధాన లక్ష్యాలు**

భారత ఎలక్ట్రానిక్స్ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు పరిశ్రమ అత్యవసరంగా దృష్టి పెట్టాల్సిన నాలుగు ప్రధాన అంశాలను మంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు. ఆయన ప్రకారం, ముందుగా కేవలం అసెంబ్లింగ్ మాత్రమే కాకుండా, స్పెషలైజ్డ్ డిజైనింగ్ సామర్థ్యాలను గణనీయంగా పెంచుకోవాలి. రెండోది పూర్తి స్థాయి దేశీయ సప్లై చెయిన్‌ను నిర్మించడం. ఇక్కడ ప్రతి చిన్న విడిభాగం వరకు భారతదేశంలోనే తయారు చేయాలి. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నాణ్యతలో రాజీ పడని సంస్కృతిని పెంపొందించుకోవాలి. తయారీ రంగంలో ప్రతిభ కలిగిన కార్మికుల కొరత రాకుండా శిక్షణా కార్యక్రమాల్ని 10 రెట్లు పెంచాలి.

# పంద్రాగస్టు వేళ భారీ ఐఎస్ఐ నెట్‌వర్క్‌ను తుడిచిపెట్టాం

ఉగ్రవాదంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. టెర్రరిజం పట్ల భారత్ 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటిస్తూ 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలలో సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్లలో దేశ భద్రతా సంస్థలు స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే ఐఎస్ఐ మద్దతు గల, పాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్ర సంస్థ షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసినట్లు వెల్లడించారు. షహజాద్ భట్టి నెట్‌వర్క్‌కు చెందిన 200 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేశామని పేర్కొన్నారు. తద్వారా విధ్వంసకర దాడుల ప్రణాళికలను భగ్నం చేశామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో అమిత్ షా పోస్ట్ పెట్టారు.

"దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు మోదీ సర్కార్ 200 మందికి పైగా షహజాద్ భట్టి నెట్‌వర్క్ ఆపరేటివ్‌లను అరెస్టు చేసింది. ఈ క్రమంలో ఐఎస్ఐ మద్దతుగల ఉగ్ర సంస్థ షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసింది. విధ్వంసక దాడులకు షహజాద్ భట్టి నెట్‌వర్క్ వేసిన ప్రణాళికలను భగ్నం చేసింది. ఉగ్రవాదం పట్ల భారత్‌కు ఉన్న జీరో టాలరెన్స్‌కు ఇదొక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుంది. భారత భద్రతా దళాలు 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలలో సమన్వయంతో కూడిన ఆపరేషన్లను ప్రారంభించి షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను చిన్నాభిన్నం చేశాయి. ఐఎస్ఐ నిధులతో నడిచే ఈ సంస్థ నుంచి ఐఈడీలు, పాక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టల్స్, తూటాలు, గూఢచర్యానికి ఉపయోగించే సీసీటీవీ కెమెరాలతో సహా భారీ మొత్తంలో సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. షహజాద్ భట్టి నెట్‌వర్క్



అనేక ఉగ్రవాద కార్యకలాపాలలో పాలుపంచుకుంది" అని అమిత్ షా పేర్కొన్నారు.

**కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకారం**

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఐఎస్ఐ మద్దతు గల ఉగ్ర సంస్థ షహజాద్ భట్టి నెట్‌వర్క్‌కు దేశంలో జరిగిన గ్రెనేడ్, ఐఈడీ, పెట్రోల్ బాంబు దాడులు, లక్షిత హత్యలతో సంబంధం ఉంది. పోలీసులు, రక్షణ, మతపరమైన ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించడానికి, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి స్థానిక మధ్యవర్తులకు ఈ నెట్‌వర్క్ డబ్బు ఇస్తోంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ (ఉపా) చట్టం, భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద షహజాద్ భట్టి గ్యాంగ్‌పై 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. సీమాంతర ఉగ్రవాదం పట్ల దేశ జీరో టాలరెన్స్ విధానంలో భాగంగా 14 రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్‌కు చెందిన 253 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ (62), హరియాణా (52), ఢిల్లీ (51), పంజాబ్ (44), రాజస్థాన్ (15), మహారాష్ట్ర (8), ఉత్తరాఖండ్ (5), కర్ణాటక, గుజరాత్, బిహార్‌లో చెరో ముగ్గురు, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, కేరళలో చెరో ఇద్దరు భట్టి నెట్‌వర్క్ ఆపరేటివ్‌లను అరెస్ట్ చేశారు.

**గ్యాంగ్‌స్టర్ టు టెర్రరిస్ట్**

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాది షహజాద్ భట్టికి సంబంధించిన మూడు ఉగ్రవాద గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్ కేసులకు సంబంధించి ఎన్ఐఏ ఇటీవలే పంజాబ్, హరియాణాలలో 18 చోట్ల సోదాలు చేపట్టింది. ఉగ్ర కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించేందుకు కొంత మందిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టింది. ఈ మూడు కేసుల్లో ఎన్ఐఏ నిఘాలో ఉన్న వ్యక్తుల కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, ఆర్థిక లావాదేవీలు, కార్యకలాపాలకు సంబంధించిన సమాచారంతో పాటు, పలు డిజిటల్ డివైజ్‌లు, పత్రాలను కూడా ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సరిహద్దుల అవతల జరుగుతున్న భారీ కుట్రను ఛేదించేందుకు సోదాల సమయంలో సేకరించిన సమాచారం, సాక్ష్యాలను ఫోరెన్సిక్, సాంకేతిక పరీక్షల కోసం పంపారు. గ్యాంగ్‌స్టర్ నుంచి ఉగ్రవాదిగా మారిన షహజాద్ భట్టి నడుపుతున్న నెట్‌వర్క్ వెనుక ఉన్న భారీ కుట్రను ఛేదించే లక్ష్యంతో సాగుతున్న దర్యాప్తులో భాగంగా తదుపరి విచారణ కోసం కొందరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు.

# బీజేపీ నూతన జాతీయ కార్యవర్గం

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కొత్త జాతీయ టీమ్‌ను ప్రకటించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో పనిచేయనున్న కొత్త కార్యవర్గంలో అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు ప్రాధాన్యం ఇచ్చారు. మహిళలకు కూడా గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించారు. నబీన్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి దాదాపు ఆరు నెలల తర్వాత కొత్త టీమ్‌ను ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. జాతీయ కార్యదర్శులుగా 16మందికి అవకాశం కల్పించగా, పురందేశ్వరి సహా 13మంది ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. అయితే ఈ టీమ్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరికి చోటుదక్కగా, తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా ప్రాతినిధ్యం లభించలేదు. జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు)గా బీఎల్ సంతోష్ తన పదవిలోనే కొనసాగనున్నారు. అమేథీ మాజీ ఎంపీ స్మృతి ఇరానీ, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ దేబ్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, గజేంద్ర పటేల్, సతీశ్ పూనియా, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియాకు జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కీల బాధ్యతలు అప్పగించారు.

**ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు**

పార్టీలో కీలకమైన జాతీయ ఉపాధ్యక్ష పదవులకు పలువురు సీనియర్ నేతలను నియమించారు. మాజీ రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే, మాజీ ఉత్తరాఖండ్ సీఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ జయ్ పాండా, ఆంధ్రప్రదేశ్?కు డీ పురందేశ్వరి, రేఖా వర్మ తదితరులకు ఈ బాధ్యతలు దక్కాయి. మొత్తం 13 మంది కొత్త జాతీయ ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం ప్రత్యేకంగా నిలిచింది. వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషి, భారతి ప్రవీణ్ పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్య, ప్రొఫెసర్ ఎం. నాగరాజ, ప్రొఫెసర్ తారిఖ్ మన్సూర్, మధుచంద్ర కర్ తదితరులు కూడా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు.

**జాతీయ కార్యదర్శులుగా 16 మందికి చోటు**

జాతీయ కార్యదర్శుల జాబితాలోనూ పలు రాష్ట్రాలకు



ప్రాతినిధ్యం కల్పించారు. మధ్యప్రదేశ్ నుంచి కవితా పటిదార్, కేరళ నుంచి కె. సురేంద్రన్, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి డాక్టర్ భోలా సింగ్, జార్ఖండ్ నుంచి ప్రదీప్ వర్మ, గుజరాత్ నుంచి జగదీశ్ ఇశ్వర్‌భాయ్ పటేల్ నియమితులయ్యారు. ఢిల్లీ నుంచి సందీప్ పాఠక్, స్వదేశ్ సింగ్, జై ప్రకాశ్, నాగాలాండ్ నుంచి ఫాంగ్నోన్ కొన్యాక్, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి సంగీత యాదవ్, కేరళ నుంచి అనిల్ ఆంటోనీ, తమిళనాడు నుంచి ఎం. వెంకటేశన్, బంగాల్ నుంచి మనోజ్ టిగ్గా, బిహార్ నుంచి సిద్ధార్థ్ శంభు, అసోం నుంచి మృగాంక దేవ్ బర్మన్, గుజరాత్ నుంచి రోహన్ గుప్తాకు జాతీయ కార్యదర్శుల బాధ్యతలు అప్పగించారు.

**పీయూశ్ గోయల్‌కు మరోసారి**

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు మరోసారి బీజేపీ జాతీయ కోశాధికారి బాధ్యతలు అప్పగించారు. పార్టీ ఆర్థిక వ్యవహారాలను ఆయన పర్యవేక్షించనున్నారు. రాజ్యసభ సభ్యుడు తరుణ్ చుగ్‌ను కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా నియమించారు. గుజరాత్ ఎంపీ హేమాంగ్ జోషికి బీజేపీ యువమోర్చా బాధ్యతలు అప్పగించగా., ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రూప్ కుమారి చౌధరీ మహిళా మోర్చాను పర్యవేక్షించనున్నారు.

**మీడియా, సోషల్ మీడియా టీమ్‌లోనూ మార్పులు**

బీజేపీ మీడియా విభాగంలోనూ కీలక బాధ్యతలను ఖరారు చేసింది. లోక్‌సభ ఎంపీ అనిల్ బలూనీ మీడియా కన్వీనర్‌గా కొనసాగనున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశిశ్ ఉషా అగర్వాల్, ఢిల్లీకి చెందిన ప్రదీప్ భండారీ, సిద్ధార్థ్ యాదవ్ కో-కన్వీనర్లుగా వ్యవహరించనున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్‌కు సోషల్ మీడియా కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు. పార్టీ ప్రచార వ్యూహాల్లో సామాజిక మాధ్యమాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

**కొత్త టీమ్‌కు మోదీ అభినందనలు**

ఇదిలా ఉండగా, బీజేపీ నూతన కార్యవర్గ సభ్యులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. బీజేపీని బలోపేతం చేయడంలోనూ, ప్రజా సేవపై దృష్టి సారించడంలోనూ ఈ కొత్త బృందం తమ వంతు ఉత్తమ కృషి చేస్తుందనే నమ్మకం ఉందని అన్నారు. అలాగే క్షేత్రస్థాయి ప్రజలతో అనుబంధాన్ని కలిగి ఉంటుందని ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఇక నితిన్ నబీన్ కొత్త టీమ్‌కు ముందున్న అతిపెద్ద సవాలు 2027 అసెంబ్లీ ఎన్నికలే. ఉత్తర్‌ప్రదేశ్ సహా పలు కీలక రాష్ట్రాల్లో వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచడం, సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయడం కొత్త టీమ్‌కు కీలకంగా మారనుంది.

## 2014 నుంచి నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు

పరీక్షల అవకతవలపై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం సోమవారం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో టీడీపీఎల్ సంస్థ 2014 నుంచి నిర్వహించిన పరీక్షలు అన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అంతేకాదు, విద్యార్థుల ప్రయోజనాల కోసం కఠినమైన చట్టం తీసుకొస్తామని సీఎం హేమంత్ సోరెన్ వెల్లడించారు. టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (టీడీపీఎల్) సంస్థ 2014 నుంచి నిర్వహించిన అన్ని పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపిక చేసిన అభ్యర్థుల లిస్టు సహా ఆ సంస్థకు సంబంధించిన ప్రతిదానినీ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్? ప్రకటించారు. "2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని చిన్న, పెద్ద పొరపాట్లు అన్నింటిపై సమగ్రంగా విచారణ చేస్తాం. కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టానికి చేసిన సవరణలపై చర్చించడానికి త్వరలో సమావేశమవుతాం. అవసరమైతే ఈ అంశంపై చర్చించడానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను కూడా నిర్వహిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. సిట్?, సీఐడీ చేసిన దర్యాప్తులో అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. ప్రస్తుతం ఇంకా విచారణ కొనసాగుతున్నందన, ప్రతి విషయాన్ని బహిరంగా వెల్లడించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

## అణు ప్రమాదంలో న్యాయమైన పరిహారం ఇవ్వకుండా ఆ చట్టం కోర్టులను నిరోధిస్తుందా?



అణు ప్రమాదం సంభవించినప్పుడు బాధితులకు సరైన, న్యాయమైన నష్టపరిహారాన్ని అందించకుండా దేశంలోని కోర్టులను శాంతి చట్టం నిరోధిస్తుందా లేదా అనే విషయాన్ని స్పష్టం చేయాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని కోరింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈమేరకు పరిమిత నోటీసులు జారీ చేసింది. అలాగే ఈ చట్టం కింద ఏర్పాటు చేసే నియంత్రణ మండలిలో సభ్యులను నియమించే ప్రక్రియలో ఎలాంటి ప్రయోజనాల సంఘర్షణ లేదనే విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆదేశించింది. మాజీ అధికారి ఈఏఎస్ శర్మ నేతృత్వంలోని ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలతో కూడిన పిటిషనర్ల బృందం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. శాంతి చట్టం- 2025 రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 కింద ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ బృందం తరపున హాజరైన న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, నేహా రాఠీ వాదనలు వినిపిస్తూ, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్లాంట్ నిర్వాహకుల ఆర్థిక బాధ్యతపై ఈ చట్టం గరిష్ఠ పరిమితిని విధిస్తోందని వాదించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, ఈ చట్టంపై ప్రజల్లో చాలా ఆందోళనలు, అపోహలు ఉన్నాయని అన్నారు. నిర్వాహకుల బాధ్యతపై పార్లమెంటు పరిమితి విధించినప్పటికీ, న్యాయమైన, సరైన నష్టపరిహారం ఇవ్వకుండా అది కోర్టును నిరోధించదని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్వాహకులను ప్రోత్సహించడానికి, దేశంలోకి పెట్టుబడులను ఆకర్షించడానికి మాత్రమే పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించిందని ఆయన గుర్తుచేశారు. అణుశక్తి కమిషన్ ఏర్పాటు చేసిన సెర్చ్?, ఎంపిక కమిటీ సిఫార్సుల మేరకు, శాంతి చట్టంలోని సెక్షన్ 17 (4) కింద అణుశక్తి నియంత్రణ సంస్థ (ఏఈఆర్‌బీ) సభ్యుల నియామకంపై తన వైఖరిని స్పష్టం చేయాలని ధర్మాసనం కేంద్రాన్ని కోరింది.

అయితే, ఈ నిబంధనల వల్ల నిర్వాహకులు భద్రతా ప్రమాణాల విషయంలో నిర్లక్ష్యం వహించే అవకాశం ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ న్యాయస్థానానికి వివరించారు. దేశంలోని అణు విద్యుత్ కేంద్రాలను నడపడానికి అణుశక్తి కమిషన్ బాధ్యత వహిస్తుందని, అది నియంత్రణ సంస్థకు సభ్యులను సిఫార్సు చేయలేదని, అలా చేయడం ప్రయోజనాల సంఘర్షణ అవుతుందని భూషణ్ అన్నారు.

2010 నాటి అణు విద్యుత్ బాధ్యత పౌర బాధ్యత చట్టం స్థానంలో వచ్చిన సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శానూాచీ×) చట్టం, ప్రైవేట్ కంపెనీలను పౌర అణు విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి అనుమతిస్తుంది. కానీ అణు విద్యుత్ ప్లాంట్‌లో ఏదైనా దురదృష్టకర ప్రమాదం జరిగినప్పుడు రూ. 3,000 కోట్లకు మించిన బాధ్యత నుంచి వాటికి మినహాయింపు ఇస్తుంది. ఈ చట్టంలోని వివిధ నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు "ఆర్థిక విధానానికి" సంబంధించినవని అత్యున్నత న్యాయస్థానం మే 19న పేర్కొంది.

ఇదిలా ఉండగా, అణు నష్టం కోసం బీమా పాలసీ, ఆర్థిక భద్రత లేదా రెండింటిని నిర్వహించాలని అణు మంత్రిత్వ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ (శాంతి) చట్టం 2025 డ్రాఫ్ట్ నియమాలను న్యూక్లియర్ ప్లాంట్ ఆపరేటర్లు పాటించాలని సూచించింది. సంబంధిత స్టోరేజీ పూల్ నుంచి ఇంధనాన్ని తొలగించే వరకు ఆర్థిక భద్రత అమలులో ఉండాలని కూడా ముసాయిదా నిబంధనలు పేర్కొంటున్నాయి. ముసాయిదా నిబంధనల ప్రకారం, కేంద్రం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి, అణు నష్టం కోసం ఆపరేటర్ పౌర బాధ్యత, గరిష్ఠ పరిమితులను సమీక్షించడానికి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి.

## పప్పుధాన్యాల రైతులకు గుడ్‌న్యూస్ దిగుబడి 15 శాతానికి పెంచేలా శాస్త్రవేత్తల కొత్త టెక్నిక్

పప్పుధాన్యాల సాగు చేసే రైతులకు శాస్త్రవేత్తలు శుభవార్తను అందించారు. తక్కువ ఖర్చుతో పంట దిగుబడిని పెంచే కొత్త టెక్నాలజీని ఉత్తర్‌ప్రదేశ్ కాన్పూర్‌లోని ఇండియన్ ఇన్?స్టిట్యూట్? ఆఫ్? పల్సెస్ రీసెర్చ్ (ఐఐపీఆర్) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రైజోబియం, ఫాస్ఫరస్?ను కరిగించే బ్యాక్టీరియా మిశ్రమాన్ని రూపొందించారు. దీనిని పొలాల్లో నేరుగా విత్తనాలను శుద్ధి చేయడానికి ఉపయోగించవచ్చు. దీని వల్ల పప్పుధాన్యాల దిగుబడిని 10 నుంచి 15 శాతం వరకు పెంచవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఎరువుల కొరత, పెరుగుతున్న సాగు ఖర్చులతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఈ పరిశోధన ప్రాధాన్యతను సంతరించుకుంది. వాతవరణంలో దాదాపు 79 శాతం నత్రజని ఉంటుంది. కానీ మొక్కలు దాన్ని నేరుగా వినియోగించుకోవలేవు. ఈ సమయంలో రైజోబియం వంటి ప్రయోజనకరమైన బ్యాక్టీరియా నత్రజనిని గ్రహించుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి మొక్కల వేర్లపై కణుపులు ఏర్పరిచి వాతావరణంలోని నత్రజనిని గ్రహించేలా చేస్తాయి. ఫలితంగా మొక్కల ఎదుగుదల మెరుగుపడుతుంది. అదేవిధంగా, ఫాస్ఫరస్ సోల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్?బీ) నేలలో ఉంటే భాస్వరాన్ని మొక్కలు సులభంగా గ్రహించే రూపంలోకి మార్చడంలో సహాయపడుతుంది. ఈ రెండు రకాల ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను కలిపి వినియోగించడం వల్ల మొక్కల పెరుగుదల మరింత మెరుగుపడుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

'దిగుబడి 10-15 శాతం పెరగొచ్చు'

రైబోబియం, ఫాస్ఫరస్ కరిగించే బ్యాక్టీరియా కలిసి పనిచేయడం వల్ల మొక్కల ఎదుగుదల గణనీయంగా మెరుగవుతుందని చంద్రశేఖర్ ఆజాద్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ అఖిలేశ్ మిశ్రా తెలిపారు.

# విద్య, వైద్యానికి ప్రాధాన్యం

-మొదటిపేజీ తరువాయి

చేయకున్నా అలాంటి కొడుకును తెలంగాణకు ఇచ్చినందుకు నాకు మేలు జరిగింది. నీ (కేసీఆర్) కొడుకు అట్లనే ఉండాలి.. అబద్ధాలు చెప్పాలి. అప్పుడే నిజాలు ప్రజలకు అర్థమవుతాయి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన 1,082 పడకల (సూపర్ స్పెషాలిటీ) డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడారు.

**మీ ఫాంహౌస్‌లు ఏమైనా ఆగాయా?**

'కేసీఆర్‌కు ఎర్రవల్లిలో వెయ్యి ఎకరాల్లో ఫాంహౌస్.. ఆయన కుమారుడికి జన్వాడలో వంద ఎకరాల్లో ఫాంహౌస్.. ఆయన చెల్లికి శంకర్‌పల్లిలో 50 ఎకరాల్లో, బావ మొయినాబాద్‌లో 20 ఎకరాల్లో ఫాంహౌస్ కట్టుకున్నారు. అందులో ఏదైనా ఆగిందా? పేదల ఆస్పత్రులు ఏవైనా పూర్తి చేశారా? ఇంత కూడా ఆత్మపరిశీలన చేయకుండా సమాజం గమనిస్తుందని సిగ్గు పడకుండా నోటికొచ్చిన అబద్ధాలు చెప్పి బతకాలను కుంటున్నారు. ఇకనైనా మీ బుద్ధి మారాలి. కరువు రావాలని అఘోర దీక్షలు, రైతులు చచ్చిపోవాలని చేతబడులు చేయించడం మానాలి. మీరు సంపాదించిన రూ. లక్ష కోట్లలో నియోజకవర్గానికి రూ. 10 కోట్లో లేదా రూ. 20 కోట్లో ఖర్చు చేస్తే.. నల్లమల, ఆదిలాబాద్ అడవుల్లో సేవలందిస్తే మీరు చేసిన పాపాలు తగ్గుతాయి'అని సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**విద్య, వైద్యానికి ప్రాధాన్యం..**

ప్రజాపాలనలో విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సంక్షేమం, అభివృద్ధిని ప్రాధాన్య అంశాలుగా తీసుకున్నామని సీఎం రేవంత్ చెప్పారు. ఇప్పటివరకు 16 వేల మంది వైద్య సిబ్బందిని నియమించామన్నారు. వైద్యంపై ఖర్చును సంక్షేమం, ఖర్చు కింద చూడటం లేదని.. భవిష్యత్తు కోసం పెట్టుబడి పెడిగా చూస్తున్నామని తెలిపారు. 'ప్రస్తుతం విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారాయి. పేదలు కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరితే ఆస్తులమ్మినా సరిపోక కిడ్నీలు అమ్ముకొనే పరిస్థితి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ అవగాహనతో ప్రజలకు ఉచిత, నాణ్యమైన వైద్యం అందించాలని నిర్ణయించింది. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే గుండె, కిడ్నీ బాగుండాలి. ఇందులో భాగంగానే మర్రి చెన్నారెడ్డి పేరుమీద వైద్య సాయం అందుబాటులోకి తెచ్చాం'అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. 32 నెలల పాలనలో ఆరోగ్యశ్రీ కోసం రూ. 2,700 కోట్లు కేటాయించామని, సీఎంఆర్ఎఫ్ రూ. 2,526 కోట్లు ఖర్చు చేశామని సీఎం వెల్లడించారు. ప్రజాప్రభుత్వంలో వైద్యం కోసం రూ. 21,800 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు.

**10 వేల పడకలు అందుబాటులోకి..**

రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యంతో ప్రభుత్వ ఆస్పత్రులను నిర్మిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గోషామహల్‌లో 2 వేల పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాదిన్నరలోగా.. 2027 డిసెంబర్ 9 నాటికి ఉస్మానియా ఆస్పత్రి, ఎల్బీ నగర్‌లో, అల్వాల్‌లో ఇలా ప్రతి ఆరు నెలలకో ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభిస్తామని చెప్పారు. దీనివల్ల 10 వేల ఆసుపత్రి పడకలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆయా ప్రభుత్వ ఆస్పత్రులను నిమ్స్, ఎయిమ్స్‌తో పోటీ పడి సేవలందించేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. రోగులకు ఉచిత భోజనం, రోగుల సహాయకులకు డార్మిటరీలు, ఇతర వసతులు కల్పిస్తామని వివరించారు.

**అదనంగా పనిచేసే వైద్యులకు ఇన్సెంటివ్‌లు**

ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులను అదనపు సమయం పనిచేయాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అలా పని చేసే వారికి ఇన్సెంటివ్‌లు ఇస్తామన్నారు. ప్రభుత్వ వైద్యుల నైపుణ్యాన్ని, నేర్పరితనాన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరే పేషెంట్ల కోసం ఉపయోగించుకోవాలని.. ప్రభుత్వం ఇన్సెంటివ్‌లు ఇవ్వకపోవడం వల్ల వారు ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అందువల్ల ఉన్నతాధికారులు ఈ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కష్టం వస్తే తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ అన్న అండగా ఉన్నాడన్న విశ్వాసం ప్రజలకు కల్పించాలని చెప్పారు. అంతకుముందు టిమ్స్ ఆస్పత్రిలో వార్డులు, ఓపీ, ఓటీలలో సహచర మంత్రులు, అధికారులతో కలిసి సీఎం కలియతిరిగారు. సిబ్బందితో మాట్లాడారు. ఒక్కో వార్డును ఒక్కో మంత్రి, ఎమ్మెల్యేతో ప్రారంభోత్సవం చేయించారు. సురక్షిత ఆహారం, నాణ్యమైన మందులే లక్ష్యంగా టీజీ సేఫ్, ఆరోగ్య దీపిక పాలిక్లినిక్‌లను ప్రారంభించారు.

**కోటి కుటుంబాలకు ఆరోగ్యశ్రీ: డిప్యూటీ సీఎం భట్టి**

రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ. 10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్రంలో 2023 నుంచి రూ. 8,923 కోట్లను ఆస్పత్రుల కోసం ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. 'కానీ మేం చేసిన ప్రతి పని తామే చేశామని చెప్పుకొనే తప్పుడు సంస్కృతితో సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేసుకునే ప్రతిపక్షం రాష్ట్రంలో తిరుగుతోంది'అని బట్టి విమర్శించారు. ప్రజారోగ్యం కోసం అక్టోబర్ నుంచి జులై వరకు యాక్సలరేటెడ్ పేమెంట్స్ చేయాలనే ఆలోచనతో రూ. 1,452 కోట్లు నిధులు కేటాయించినట్లు చెప్పారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రజారోగ్యం కోసం ఖర్చు చేసింది రూ. 70 కోట్లు మాత్రమేనన్నారు.

**పేదల ఆరోగ్య రక్షణ మా ప్రభుత్వానిది: మంత్రి దామోదర**

పేదల ఆరోగ్య రక్షణ తమ ప్రభుత్వానిదేనని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ కింద రూ. కోట్లు కేటాయిస్తున్నామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల వరకు బలోపేతం చేశామని తెలిపారు. గాంధీ, పేట్లబురుజు ఆస్పత్రుల్లో ఉచితంగా ఐవీఎఫ్ సేవలు అందిస్తున్నామని.. రాబోయే పదేళ్లలో తలసేమియారహిత రాష్ట్రంగా తెలంగాణ ఉండాలని లక్ష్యంగా పెటుకున్నామని మంత్రి దామోదర తెలిపారు. మూడు టిమ్స్ ఆస్పత్రులతోపాటు నిమ్స్, ప్రతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 100 పడకలను ఇంటర్నేషనల్ బెడ్స్ వింగ్ కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ప్రొ.కోదండరాం, బల్మూరి వెంకట్, రహమత్ బేగ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, టిమ్స్, నిమ్స్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# 'సర్' ముసాయిదా జాబితా విడుదల

-మొదటిపేజీ తరువాయి

షిఫ్టింగ్, అబ్సెంట్, ఇతరులు 57లక్షల 46వేల 803మంది ఉన్నారు. ఒకటి కంటే ఎక్కువ ఓటర్ల జాబితాలో నమోదు చేసుకున్న 6.70లక్షల మంది మందికి పైగా ఉన్నారు.

**92 లక్షల మందికి నోటీసులు**

ఇతర రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉండి లేదా 10వ తేదీ లోపు ఎన్యుమరేషన్ పత్రాన్ని తిరిగి ఇవ్వకపోవడం, లేదా ఓటరుగా రిజిస్ట్రర్ చేసుకోవడానికి ఓటరు ఆసక్తి చూపించకపోవడం లాంటి కారణాలు ఎన్నికల అధికారులు చూపిస్తున్నారు. అర్హత గల ఓటర్లు ఫారం 6 ద్వారా డిక్లరేషన్ ఇచ్చి తమ ఓటును పొందొచ్చని చెబుతున్నారు. ముసాయిదా జాబితాలోని 2కోట్ల 64లక్షల మంది ఓటర్లలో 92లక్షల మందికి నోటీసులివ్వాలని ఎన్నికల అధికారులు నిర్ణయించారు.

ఇందులో అనామలీస్, నో మ్యాపింగ్ వంటి కారణాలతో నోటీసులివ్వనున్నారు. ముసాయిదా జాబితాకు సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అఖిలపక్ష సమావేశం నిర్వహించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. నోటీసులు, అభ్యంతరాల స్వీకరణకు సంబంధించి రాజకీయ పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. గడువు తక్కువగా ఉందని దీన్ని పెంచాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రధాన ఎన్నికల అధికారిని కోరారు.



**ఆ పత్రాల్లో ఏదో ఒకటి సబ్‌మిట్ చేస్తే చాలు**

నోటీసులు జారీ చేయనున్న 92 లక్షల మందిలో 60లక్షల మందికి పైగా ఓటర్లు అనామలీస్‌గా గుర్తించారు. 2002 లో ఓటు వివరాలు సమర్పించినప్పటికీ సమాచారం సరిగ్గా లేకపోవడంతో ధ్రువీకరణ కోసం వాళ్లకు నోటీసులు జారీ చేస్తున్నారు. మిగతా 32 లక్షల మంది ఓటర్లు 2002 వివరాలు సమర్పించలేదు. వాళ్ల కుటుంబ సభ్యుల వివరాలు పొందుపర్చలేదు. వీళ్లందరినీ అన్ మ్యాపింగ్ కింద పేర్కొన్నారు. వీళ్లందరికీ సెప్టెంబర్ 16వ తేదీ వరకు బీఎల్?వోల ద్వారా నోటీసులు జారీ చేయనున్నారు. అక్టోబర్ 15వ తేదీ వరకు వీటిపై అభ్యంతరాలు, వివరణ తీసుకోనున్నారు. నోటీసులు వస్తే దానికింద కేంద్రం ఇది వరకే సూచించిన 11 పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పిస్తే సరిపోతుందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

నోటీసులు ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా ఓ ఒక్క ఓటును కూడా ముసాయిదా జాబితాలో నుంచి తొలగించమని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. నోటీసు ఇచ్చి దర్యాప్తు చేసి సరైన కారణాలు చూపిన తర్వాతనే ఓటు తొలగింపు ఉంటుందంటున్నారు. ముసాయిదా జాబితాలో ఓటు తొలిగింపు సంతృప్తికరంగా లేకపోతే సదరు ఓటరు జిల్లా ఎన్నికల అధికారి వద్ద కూడా అప్పీలు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వివరించారు.

సర్ జాబితాలో మీ పేరుందో లేదో చెక్ చేసుకోవడానికి ఈ లింక్‌పై క్లిక్ చేసి తెలుసుకోండి

**సర్ డ్రాఫ్ట్ జాబితాలో మీ పేరుందో లేదో ఇలా చెక్ చేసుకోండి :**

'సర్' డ్రాఫ్ట్ జాబితాను ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ముసాయిదా జాబితాలో ఓటు ఉందో లేదో తెలుసుకోవడం ఎలా అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

ముందుగా ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్‌సైట్ https://www.eci.gov.in/ వెబ్‌సైట్‌ను సందర్శించండి

అక్కడ డిస్‌ప్లే అవుతున్న ఆప్షన్లలో ఎస్ఐఆర్-2026 డౌన్‌లోడ్ ఎలక్టోరల్ రోల్ ఆప్షన్‌పై క్లిక్ చేయండి

ఆ తర్వాత ఓపెన్ అయ్యే విండోలో మీ రాష్ట్రాన్ని ఎంచుకోవాలి

తర్వాత మీ జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం, లాంగ్వేజ్?ను ఎంపిక చేసుకోవాలి

పై విధంగా చేసిన తర్వాత మీకు ఓటరు జాబితాలు వరుసక్రమంలో కనిపిస్తాయి

అందులో మీ పార్ట్?నంబర్, పేరు వివరాలు సెలక్ట్? చేసి పైనున్న క్యాప్చాకోడ్ ఎంటర్ చేయాలి

డౌన్‌లోడ్ ఆప్షన్‌పై క్లిక్ చేయగానే మీ ఓటరు జాబితా పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ అవుతాయి

దాంట్లో మీ సీరియల్ నంబర్‌తో లేదా మీ పేరుతో చెక్? చేసుకోవచ్చు.

రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎన్నికల సీఈవో సమావేశం : ఓటరు ముసాయిదా జాబితా విడుదల నేపథ్యంలో పలు రాజకీయపార్టీల ప్రతినిధులతో తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి సమావేశం అయ్యారు. ఎన్నికల కమిషన్ కార్యాలయంలో సర్ ప్రక్రియలో తదుపరి కార్యాచరణపై సీఈవో సుదర్శన్ రెడ్డి చర్చలు జరిపారు. ఈ సమావేశానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంతో పాటు ఇతర రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకులు హాజరయ్యారు. సర్? ప్రక్రియలో పార్టీలు చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణపై సుదర్శన్? రెడ్డి వారికి దిశానిర్దేశం చేశారు.

# కరీంనగర్ డెయిరీ పేరు మార్పుపై పాడి రైతుల ఆందోళన

**కరీంనగర్ :** సమస్యలతోపాటు రికార్డుల్లో కరీంనగర్ డెయిరీ పేరు మార్పుపై పాడి రైతాంగం కదం తొక్కింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు, ఫ్లెక్సీలు, కళాకారుల ఆట, పాటలు, డప్పు చప్పుళ్లతో నిరసన వ్యక్తం చేసింది. కరీంనగర్ పద్మనగర్‌లోని కరీంనగర్ డెయిరీ నుంచి కలెక్టరేట్ వరకు వేలాదిమంది పాదయాత్ర నిర్వ హించి నినాదాలతో హోరెత్తించారు. కలెక్టర్ చి త్రామిశ్రాకు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ పాడి రైతులతో నడిచే కరీంనగర్ డెయిరీని ప్రోత్సహించాల్సిందిపోయి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగుతోందన్నారు. సర్వే నంబర్ 194లో 22.18 ఎకరాలు కరీంనగర్ డెయిరీ భూములుండగా అందులోని 11.32 ఎకరాలను కో ఆపరేటివ్ ఫెడరేషన్ పేరిట మార్చడం దుర్మార్గమని మండిపడ్డారు. 2018 వరకు లీటరుకు రూ.4 ఇన్సెంటివ్ ఇచ్చారని, ఎనిమిదేళ్లుగా ఇవ్వకపోవడం శోచనీయమ న్నారు. భూములను వెంటనే డెయిరీ పేరిట మార్చాలని డిమాండ్ చేశారు. టెండర్లలోనూ డెయిరీకి అన్యాయం చేశారని, లీటరు రూ.62కు ఇస్తామని టెండర్ వేస్తే లీటరుకు రూ.64.50కి ఇస్తామన్న ఫెడరేషన్‌కు ఇచ్చారని, అలాగే దేవాలయాలకు రూ.600కు ఇస్తామని డెయిరీ చెబితే.. రూ.609కి ఇస్తామన్న ఫెడరేషన్‌కు ఇచ్చారని, ఇది కక్షపూరిత చర్య కాదా? అని రాజేశ్వర్‌రావు ప్రశ్నించారు. ఈ ఆందోళన ఆరంభం మాత్రమేనని, ప్రభుత్వం స్పందించని క్రమంలో లక్షమంది రైతులతో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



డెయిరీ పాలకవర్గంతోపాటు సుమారు 4 వేల మంది పాడి రైతులు పాల్గొన్నారు.

## మంత్రివర్గ రేసులో ఆ ముగ్గురు!

-మొదటిపేజీ తరువాయి

అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు చోటు దక్కలేదు. అయితే ఈ 'విరుగుట' వెనుక బీజేపీ అధిష్టానం ఒక పెద్ద 'పెరుగుట' వ్యూహాన్నే అమలు చేస్తోందన్న విశ్లేషణలు ఢిల్లీ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

**ముందే సంకేతాలు అందాయా?**

ఇటీవల ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పార్టీ తెలంగాణ ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాబోయే రోజుల్లో జాతీయ కమిటీ పునర్వ్యవస్థీకరణ, రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. ఆ భేటీలోనే కొత్త జాతీయ బృందంలో తెలంగాణ నేతలకు చోటు ఉండకపోవచ్చనే సంకేతాలు ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

**కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై దృష్టి?**

జాతీయ కమిటీలో తెలంగాణకు పదవులు దక్కకపోవడానికి త్వరలో జరగబోయే కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణే ప్రధాన కారణమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పార్టీ రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తి రెండు పదవులు నిర్వహించేందుకు వీల్లేదు. జాతీయ కార్యవర్గ పదవుల కంటే కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రానికి సరైన ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచనతోనే అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఊహాగానాలు సాగుతున్నాయి. తెలంగాణ నుంచి ఒకరిద్దరికి కేంద్ర మంత్రివర్గంలో చోటు లభించే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది.

**మంత్రివర్గ రేసులో ఆ ముగ్గురు!**

కేంద్ర కేబినెట్ రేసులో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందుర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. బీసీ సామాజికవర్గానికి చెందిన ఈటల సీనియర్ నేత కావడం, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండటంతో ఆయనకు బెర్త్ ఖాయమనే ప్రచారం సాగుతోంది. అలాగే నిజామాబాద్‌లో వరుసగా రెండోసారి గెలిచి బలమైన నాయకుడిగా ఎదిగిన అర్వింద్‌కు అవకాశం ఇవ్వడం ద్వారా ఉత్తర తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయొచ్చని అధిష్టానం భామిస్తున్నట్లు చర్చ నడుస్తోంది. ఇక గిరిజన సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గోడెం నగేశ్‌కు అవకాశం ఇస్తే సామాజిక సమీకరణలు కలసి వస్తాయని పార్టీ ఆలోచిస్తోంది.

## నిషేధిత భూములపై టోల్‌ఫ్రీ



తెలంగాణలో 22(ఏ) నిషేధిత భూముల సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కమిటీ వారానికి ఒకసారి సమావేశమై నిషేధిత భూముల దరఖాస్తులు, ఇతర సమస్యలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుందని వెల్లడించారు. నిషేధిత భూములపై పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాల్లో 22(ఏ) సమస్య ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించిన మంత్రి, మొత్తం 750 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. నిషేధిత భూములపై సమాచారానికి టోల్‌ఫ్రీ నంబరు 1800 5994788 ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

22(ఖ)పై సోమవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్‌రిజిస్ట్రార్లతో సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉన్నతస్థాయి కమిటీ వారానికోసారి సమావేశమై దరఖాస్తులు, ఇతర సమస్యలపై సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి వివరించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఈ నాలుగు జిల్లాల్లోనే సమస్య ఎక్కువగా ఉందని, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలో 511 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

**నిషేధిత భూములపై టోల్‌ఫ్రీ**

వీటితోపాటు మిగిలిన జిల్లాల్లో 22(ఏ) దరఖాస్తులన్నింటినీ ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇందుకోసం అవసరమైతే స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంచాలంటూ సూచించినట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. నిషేధిత భూములపై సమాచారానికి టోల్‌ఫ్రీ నంబరు 1800 5994788ను ఏర్పాటు చేశామని, ఎవరైనా దీనికి సమాచారం పంపినా కనీసం 3 రోజుల్లో సమాధానం అందుతుందని, పరిష్కారానికి చర్యలు చేపడతారని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం లేని కేసుల్లో ఎందుకు చేయలేమో? ప్రజలకు స్పష్టమైన కారణం చెప్పాలని అధికారులకు సూచించారు.

రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించినట్లయితే నిబంధనల ప్రకారం తిరిగి వారికి చెల్లించాలని ఆదేశించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని భూదాన్ భూములు, వాటికి సంబంధించిన పెండింగ్ సమస్యలు, వివాదాలు, పరిష్కార మార్గాలపై సమగ్ర నివేదిక రూపొందిస్తామని తెలిపారు. యూఎల్‌సీ(అర్బన్ ల్యాండ్ సీలింగ్) జాబితాను సరిచేస్తున్నామని, అసలైన హక్కుదారులకు న్యాయం చేస్తూ మరో రెండు రోజుల్లో తగు చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇచ్చామని మంత్రి పొంగులేటి తెలిపారు.

**సూపర్ ఇంపోజ్ చేసే సమయంలో సమస్యలు**

హైదరాబాద్ జిల్లాలో ఒక ఆస్తికి సర్వే శాఖ నుంచి టీఎస్ఎల్ఆర్, సర్వే నంబర్లు ఇవ్వగా, అదే ఆస్తికి జీహెచ్ఎంసీ కూడా ఇచ్చిందని, ఈ రెండింటినీ సూపర్ ఇంపోజ్ చేసే సమయంలో సమస్యలు ఏర్పడ్డాయని, వీటిని కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి శ్రీనివాస రెడ్డి వివరించారు. రంగారెడ్డి జిల్లాలో 12 ఎకరాల భూమి ఉంటే అందులో రెండు ఎకరాలు భూదాన్ భూములు ఉండగా, మొత్తం 12 ఎకరాలను 22(ఖ)లో పెట్టడంతో సమస్య ఉత్పన్నమైనట్లు తెలిపారు. అదేవిధంగా కొన్ని దేవాదాయ, అటవీ భూములు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయని, జియో ట్యాగింగ్ ద్వారా అసలు స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి మిగిలిన భూములను ఫ్రీహోల్డ్ చేయాలంటూ ఆదేశించినట్లు తెలిపారు. గతంలో హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో అప్పట్లో అధికారులు నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలను వదిలేయడంతో అవి నేటికీ నిషేధిత జాబితాలో ఉండిపోయాయన్నారు. అధికారుల చర్యలతో సామాన్యులు కూడా ఇబ్బంది పడినట్లు ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి పొంగులేటి ప్రజలకు 22(ఖ) విషయంలో క్షమాపణలు చెప్పారు. అయితే అధికారులపై నెపం నెట్టి తమ ప్రభుత్వం ఈ సమస్యను ప్రజలపై వదిలేయడం లేదని, దీనిని పరిష్కరించే బాధ్యత కూడా తానే తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. నిషేధిత భూముల పేరిట అసలైన యజమానులకు ఎటువంటి అన్యాయం జరగదని మంత్రి హామీ ఇచ్చారు. ఓ వైపు ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూనే భవిష్యత్తులో ఎటువంటి పొరపాట్లు జరగనివ్వబోమని వెల్లడించారు.

పరిశీలించి నిర్ణయం : సీఎస్-7, సీఎస్-14కు సంబంధించి కొన్ని దశాబ్దాలుగా కోర్టు కేసుల్లో మగ్గుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు కోర్టులో విచారణలు నడుస్తుండగానే మరోవైపు కొన్ని చోట్ల రెగ్యులరైజేషన్ జరిగిందని వీటన్నింటినీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌లోని ఆల్విన్, ఆజ్‌బెస్టాస్ కాలనీల్లోని ప్రైవేటు భూములను విభజించి అక్కడ రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది లేకుండా చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 511 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మిగిలిన జిల్లాల్లో ఉన్న 22(ఖ) దరఖాస్తులన్నింటినీ ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంచాలని అధికారులకు సూచించారు.

"హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి ఈ నాలుగు జిల్లాల్లోని ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టారని 750 మంది దరఖాస్తులు ఇచ్చారు. ప్రైవేటు ఆస్తులకు ఆటంకం కలిగించవద్దనేదే ఈ ప్రభుత్వం ముఖ్య ఆలోచన. 6 వేలకు పైగా కేసులు హైకోర్టులో ఉన్నాయి. న్యాయబద్ధమైన దరఖాస్తులను పరిష్కరిస్తాం. అధికారుల వల్ల ఆన్?లైన్? చేసేటప్పుడు కొన్ని ప్రైవేటు ఆస్తులు నిషేధిత జాబితాలో చేరాయి. అందుకు వారి తరపున రాష్ట్రప్రజలను క్షమాపణ కోరుతున్నా" -పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి

నవగీతం
తెలుగు దినపత్రిక
మంగళవారం
18 ఆగస్టు 2026

# సంపాదకీయం

## ఎన్డీయేకు ఊపిరి

దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన నేషనల్ డెమొక్రటిక్ అలైన్స్ ప్రభుత్వం, పాలనను మరింత సమర్థవంతంగా, మిత్రపక్షాల మధ్య ఎటువంటి మనస్పర్థలు లేకుండా నడిపించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా గతంలో ఎన్డీఏ ఉన్న కన్వీనర్ వ్యవస్థను పునరుద్ధరించాలని బీజేపీ భావిస్తోంది. ఈ ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోదీ సానుకూలంగా స్పందించి, గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. 2024లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత కేంద్రంలో భారతీయ జనతా పార్టీ సొంతంగా మేజిక్ ఫిగర్‌ను దాటలేకపోయింది. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం 293 మంది ఎంపీల మద్దతుతో నడుస్తోంది. ఇందులో తెలుగుదేశం పార్టీ 16 సీట్లు, జనతాదళ్ యునైటెడ్12 సీట్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయి. పదేళ్లలో బీజేపీకి సొంతంగా మెజారిటీ ఉండటంతో నిర్ణయాలన్నీ ఏకపక్షంగా సాగాయి. కానీ ఇప్పుడు సమ్మతి రాజకీయాల కాలం నడుస్తోంది. మిత్ర పక్షాల డిమాండ్లు, రాష్ట్రాల ప్రయోజనాలు, కేంద్ర ప్రభుత్వ విధానాల మధ్య సరైన కమ్యూనికేషన్ ఉండేలా చూడటమే ఈ కన్వీనర్ నియామకం వెనుక ఉన్న ఉద్దేశం. అత్యున్నత బాధ్యతాయుతమైన పదవికి ఇద్దరు సీనియర్ నాయకుల పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇందులో మొదటి పేరు చంద్రబాబు నాయుడు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు జాతీయ స్థాయిలో బలమైన నెట్‌వర్క్ ఉంది. గతంలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ వంటి కూటములను నడిపించిన చారిత్రక అనుభవం ఆయన సొంతం. దక్షిణాది, ఉత్తరాది పార్టీలతో ఆయనకు ఉన్న సత్సంబంధాలు కూటమికి అదనపు బలం ఇస్తాయని బీజేపీ భావిస్తోంది. రెండో పేరు నితీష్ కుమార్. హిందీ హార్ట్‌లాండ్‌గా పిలిచే ఉత్తర భారత్ రాజకీయాల్లో నితీష్ కుమార్ మాస్టర్ మైండ్. బిహార్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘ అనుభవం, ఇతర ప్రాంతీయ పార్టీలతో సమన్వయం చేయగల నైపుణ్యం ఆయనకు ఉన్నాయి. ప్రధాని మోదీతో ఆయనకు ఉన్న ప్రత్యేక అనుబంధం కూడా ఇక్కడ కలిసి వచ్చే అంశం. ఢిల్లీలో త్వరలోనే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల మెగా సమావేశం జరగనుంది. ప్రధాని మోదీ ఇప్పటికే ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినందున, ఈ సమావేశంలోనే అధికారికంగా కన్వీనర్ పేరును ప్రకటించే అవకాశం ఉందని పొలిటికల్ సర్కిల్స్ చెబుతున్నాయి.ఎన్డీయే కన్వీనర్‌గా ఎన్నికయ్యే వ్యక్తి కేవలం ఒక ప్రతినిధి మాత్రమేకాదు. కూటమిలోని అన్ని పార్టీలను ఏకతాటిపైకి తెచ్చే వారధిగా వ్యవహరిస్తారు. మిత్రపక్షాల మధ్య వచ్చే చిన్నపాటి విభేదాలను చర్చల ద్వారా ప్రాథమిక దశలోనే పరిష్కరించాలి. ఉభయ సభల్లో బిల్లులు పాస్ చేసే సమయంలో భాగస్వామ్య పక్షాలన్నీ ఒకే మాటపై ఉండేలా చూడాలి. వివిధ రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటును సజావుగా పూర్తి చేయడం వీరి విధి. ఈ ప్రతిష్టాత్మక నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ కన్వీనర్ పదవికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో పాటు, జేడీయూ అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పేర్లు జాతీయ స్థాయిలో బలంగా వినిపిస్తున్నాయి. గతంలో కేంద్రంలో కూటమి ప్రభుత్వాలను నడిపించిన అపార అనుభవం, ప్రాంతీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చిన ట్రాక్ రికార్డ్ ఉన్న చంద్రబాబు వైపు మెజారిటీ పార్టీలు మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోందిఅయితే కూటమిలోని అందరు భాగస్వామ్య నేతలతో చర్చించి, అందరికీ ఆమోద యోగ్యుడైన మరో సీనియర్ నేత పేరును కూడా పరిశీలించే అవకాశం లేకపోలేదు. కేంద్రంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వివిధ రాష్ట్రాల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, కూటమి పార్టీల మధ్య ఎప్పటికప్పుడు చర్చలు జరపడానికి ఒక ప్రత్యేక యంత్రాంగం అవసరమని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. త్వరలోనే జరగబోయే ఎన్డీయే అగ్రనేతల ప్రత్యేక భేటీలో ఈ కన్వీనర్ నియామకంపై అధికారికంగా ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాలు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల విషయంలో ఈ పదవి చాలా కీలకం కానుంది. రాష్ట్రాల్లోని సమస్యలై నేరుగా కేంద్రమంత్రులు, హోంమంత్రితో చర్చించి నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

# పంపానుజ శాసనం కొత్త వెలుగులు

ఈ వాచకాభరణుడు, కుర్క్యాల శాసనంలో తన బిరుదుగా పేర్కొన్న జినవల్లభుడే. పై పద్యంలో బిరుదులా కాక, బిరుదే వ్యవహారనామంగా నాడు ప్రసిద్ధి చెందినదిగా భావించవచ్చు. పేరు పేర్కొనలేదు. మిగతావి రెండు విశేషణాలు. కర్ణునితో సమానమైన దానశీలత కలిగినవాడని మల్లియ రేచన చెప్పినాడు. పంప జైనుడే ఐన ద్విజావసద గ్రామంలోని ద్విజుల వరప్రసాదము (అమ్మమ్మ ఇంటి వల్ల) కలిగినవాడని చెప్పాడు. ఈ ముగ్గురూ జైనులే. కాని, బ్రాహ్మణానురక్తులే.

జినవల్లభుని కుర్క్యాల శాసనంలో కర్ణసమానదాత అన్నది సత్యమే అని నిర్ధారించేలా జినవిగ్రహ నిర్మాణం, గుణార్ణవమనే పంపని పేరిట చెరువును తవ్వించడం, మదనవిలాసమనే ఉద్యానవనాన్ని, త్రిభువనతిలకమనే జినమందిరాన్ని నిర్మించడం పేర్కొబడ్డది. అబ్బెనబ్బె, జినవల్లభ, పంపకవి సోదరుల తల్లి అని ఈ శాసనం చెప్తుంది. అబ్బె అంటే అవ్వ. గౌరవ (మాతృక) వాచకం. అచ్చబ్బె, దేవకబ్బె, దీపకబ్బె వంటి పేర్లు నాడు స్త్రీలకుండేవని ఆహవమల్లుని చొప్పదండి శాసనం ధృవీకరిస్తున్నది.

ఈ మూడు తెలుగు, మూడు కన్నడ కందపద్యాలు ఈ శాసనంలో జినవల్లభుడు రాశాడు. నాడు కరీంనగర్ ప్రాంత కవులకు అత్యంతాభిమానోపాదేయ ఛందం గా ఉండేది. హాలుని గాథాసప్తశతి సంకలనంలో ప్రాకృత ఛందాలన్నీ గాథాచ్ఛందాలే. గాథ 10 భేదాల్లో కందం ఒకటి. ఇది ప్రాకృతంలో ఖంద అ. అక్కడి నుంచే తెలుగులోకి వచ్చింది. జగణ నిషేధం ప్రాకృత ఛందోలక్షణం. తెలుగులో ఈ నియమం లేదు. కందంలో ఉన్నది. పంపని కాలంలో అతనికి ధారాదత్తం అయిన ఈ ధర్మపురి నుంచే ఓ అజ్ఞాత కవి క్రీస్తు శకం 918 (శ.సం.840)లో శ్రీధర్మపురి క్షేత్ర మహాత్మ్యమనే మూడున్నరవేల శ్లోకాలతో సంస్కృత భాషలో కావ్యం రాశాడు. దాంట్లో కూడా కంద పద్యాలున్నాయి. దీంట్లో (సంస్కృతంలో లేని, అక్కరలేని య కార) ద్వితీయాక్షర ప్రాస కూడా ఉన్నది. కవిజనాశ్రయ ఛందస్సు మల్లియ రేచన అన్ని పద్యాలు మొత్తం గ్రంథం కందచ్ఛందంలోనే రాశాడు. ఆదిపురాణంలో, విక్రమార్జున విజయంలో 730 కందపద్యాలు పంపమహాకవి వాడినాడు. ఈ ప్రాంతం కందాల నిలయం. తండ్రి వేంగి నుంచి సబ్బి మండలానికి వలస రాగా, ఇక్కడి సింగన కూతురిని పెండ్లాడిన కారణంగా భీమన ఈ ప్రాంతం వాడైనాడు. ఆయన ఇద్దరు కొడుకులు పంప, జినవల్లభుడు ఈ సబ్బి (కరీంనగర) ప్రాంతీయులే అయినారు. కన్నడ విక్రమార్జున విజయంలో బనవాసి వర్ణన కేవలం అమ్మమ్మల పూర్వీకుల ప్రాంతాలపై ప్రేమతో పేర్కొన్నదే.

జయనంది శిష్యుడై సన్యసించిన పంపడు సన్యాసానంతరం శుభనంది అయినాడు. అతడు అంతిమ దినాలు జైనుల పరమ పవిత్రక్షేత్రమైన బోధన్‌లో గడుపుతూ దివంగతుడైనాడు. పంపడు రాసిన ఆదిపురాణం రిషభదత్తుని చరిత్ర. ఈయన జైనమత ప్రతిష్ఠాపకుడు. తొలి జైనమత ప్రవక్త. ఈతని కుమారుడు బాహుబలి రెండవ ప్రవక్త. వీరిద్దరూ బోధన్ ప్రభువులు. క్రీ.పూ. 1000 ప్రాంతం వారు.ఎఆర్‌శీతీఎ

24వ తీర్థంకరుడైన మహావీరునికి ఐదు శతాబ్దులు పూర్వమువారు. మహావీరుడు బుద్ధునికి ముందువాడు. అదే శతాబ్ది. వీరు 450 ఏండ్ల ముందువారు. బోధన్ (పోదన, పౌదన్య, బహుధాన్య, పోతన అని వివిధ నామాలున్న) నగరం, తెలంగాణలో 3 వేల ఏండ్ల క్రిందటిది. ఇది అశ్మక రాజ్య రాజధాని నగరం. దీనిని మహిషాసురుడేలినాడు. అతనిపేర ఈ నగరంలో రాకాసి వీధి అని ఒక వీధి (ప్రాంతం) ఉన్నది. భైంసా (మహిషా), భైంసాసురపూర్ ఇతని పేరిటగల ఈ ప్రాంతపు నగరాలు ఇప్పటికీ ఇదే పేర్లతో ఉన్నాయి. రాష్ట్ర కూటరాజుల కాలంలో కలబురిగి (గుల్బర్గా) ప్రాంతంలోని జినసేనుడు క్రీ.శ.783లో రాసిన పూర్వపురాణం ఆధారంగా పంపడు జినేంద్ర పురాణం అనే తెలుగు కావ్యం రాశాడు. దానిలోని ఒక సీసపద్యం మాత్రం దొరికింది. పంపని జినేంద్ర పురాణం తెలుగుకావ్యం దొరికితే కన్నడాంధ్రులకు ఈతడే తొలికవి అయి ఉండేవాడు. ఇమ్మడి అరికేసరి (ఇమ్మడి అంటే రెండవవాడు) ఆస్థానియైన పంపడు వేములవాడలోనే ఉన్న అరికేసరికి తండ్రి నరసింహుడు ఏలిన రాజధాని నగర బోధన్‌కు తరచూ ప్రయాణాలు సాగించేవాడు. పుణ్యక్షేత్రమైన బోధన్‌లో పంపడు చరమ జీవితం గడిపి అక్కడనే మృతుడై సమాధియైనాడు. సమాధిపై లభించిన ఈ శాసనం జినవల్లభుడు (తమ్ముడు) వేయించి ఉండవచ్చు. ఈ శాసనం కాశీనాథ్ అనే పూజారి ఇంటి పునాదిరాయిపై కందకుర్తి యాదవరావు, నేను చూశాం.

పాఠం: దీపేస్ట్ర సిద్ధా, న్తమునీశ్వరస్య శిష్యా భవ, శ్రీ శ్చుభవన్ది ముని, మాలారాధ్య, రత్నత్రయ మం, త్య కాల స్సమా, ధిన స్నుత, లోకమాయా తరువాతి శాసనభాగం ముక్కలై దొరకలేదు. ఈ శాసనం రాయి తనకెక్కడ లభించిందో పూజారి చెప్పలేకపోయాడు. చెప్పి ఉంటే మనకు సమాధి స్థలం తెలిసి ఉండేది. ఈ శాసనం గూర్చి సీతారామ జాగీర్దార్ ఎపిగ్రాఫికా ఆంధ్రికా వాల్యూం -02లో కొంత వివరణ ఇచ్చారు. దీనిలో రత్నత్రయం పేర్కొబడ్డారు. రత్నత్రయమంటే పంప, రన్నె, పొన్న కవులు. పొన్న రాష్ట్రకూట మూడవ కృష్ణుని (క్రీ.శ.939-968) ఆస్థాని. ఇతని 'సర్వదేశ కవి అన్న బిరుదు ఉన్నది. భువనైక రామాభ్యుదయం ఆయనకృతి. ఇతని కుమారుడు రన్నకవి. ఈ ముగ్గురిని పంప సమాధి శాసనం రత్నత్రయం అన్నది. దీన్ని బట్టి ఈ శాసనం క్రీ.శ.968 అవతలది అని చెప్పవచ్చు. అందువల్ల పంపమహాకవి క్రీ.శ.905లో పుట్టి, 970 ప్రాంతంలో సమాధి అయినట్టు భావించవచ్చు పంపని మరొక శాసన రచన కరీంనగర్ జిల్లాలో కనబడుతున్నది. వేములవాడ ప్రభువు అరికేసరి (ఇమ్మడి) వేయించిన శ.869 పరాభవ కార్తీక బ.11 సోమవారం నాటి శాసనం. ఇది క్రీ.శ. 946. దీని రచయిత పంపడే (నేటి పరాభవ క్రీ.శ. 2026కు 18 ఆ వృత్తుల కింది పరాభవ 2026-946=1080/60 సంవత్సరం. ఒక వృత్తం=18)

ఈ శాసనం అరిపణపల్లి గ్రామదాన శాసనం. ఈ శాసనంలో పంపడు తన విక్రమార్జున విజయంలోని ఐదు పద్యాలు (1వ ఆశ్వాసం 15, 31, 41, 42, 50 సంఖ్యగలవి). ఈ శాసనంలో రాసుకొన్నాడు. తొలి 15వ పద్యంలో ఈ శాసనం ప్రారంభం అయింది. స్వసిలి?తశ్రీ మచ్చళు కృవంస (వ్యో)) మా మృత కిరణ నెనిప కాన్తి యనొళ కొణ్డీ మహియొ ళాత్మ వంశ సిఖామణి (జ) సమెసెయె జుద్దమల్ల నెగళ్దం (1) లి ఆత్మభవనాథరాధి పనాత్మజన నహూష పృథు భగీరతనళ రామాత్మజ (రనిళి) సినెగళ్ద మహాత్మ నరసి (జ్ఞ) నటివి నొళ్ పరమాత్మం (2)లి 1, 2 పద్యాలు చూపినాను. ఇవి రెండు కంద పద్యాలే.

2వ పద్యంలో శాసనస్థ ధరాధిపకు బదులు విక్రమార్జున విజయంలో నరాధిప అని పాఠాంతరం ఉన్నది. శాసనంలో వరుసగా రాయబడ్డ పంపభారత పద్యాలు 15, 31, 41, 42 నాలుగు కంద పద్యాలే ఐదవది మాత్రం ఉత్పలమాల. దీనిలో గుణార్ణవ బిరుదు ఉన్నది. పంపడు ఈ పేరుతో చెరువు నిర్మించాడు. అలాగే ఈ శాసనంలో అరికేసరికి త్రిభువన మల్ల అనే బిరుదు ఉన్నది. పంపడు ఈ పేర్లతో తటాక, ఆలయాలు నిర్మించినట్టు జినవల్లభుని కుర్క్యాల శాసనం చెప్తున్నది. పంపడిని తొలి ఆలయ నిర్మాణ కవిగా గుర్తిద్దాం. పంప మహాకవికి పద్మకవి అని కూడా పేరు. బోధన్ పద్మపురం కనుక ఆ ఊరికవిగా పేరు. ఈయన రాసిన జినేంద్ర పురాణంలో (ఇది క్రీ.శ.940 ప్రాంత రచన) ఒక తెలుగు పద్యం దొరికింది. సీ. హరి నిలయంబును హరి నిలయంబును, విషధరాధ్యంబును విషధరాధ్య మప్సరోమయమును నప్సరోమయమును వనవిలాసమును పావన విలాస మున్నత కరిశృంగ మున్నత కరిశృంగ మురు కలన కులంబు నురు కలన కులంబు వంశుకాంత ద్యోతి నంశు కాంత మీదుకాంత స్రవమిందు కాంత మొనర నవశత సాహస్ర యోజనోన్న తమును పదివేల యోజనలమరు వలము గలిగి కనకాద్రికి న్నూట గలికినరి ప్రథితమై యొప్పు మందర పర్వతంబు. క్రీ.1560 ప్రాంతంలో ఓ అజ్ఞాత కవి సంకలించిన 32 మంది కవుల కావ్యస్థ పద్య సేకరణలో ఈ పద్యం దొరికింది. ఈ సంకలన కావ్యం పేరు ప్రబంధ రత్నావళి. ఒకే పద్యం దొరికింది. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు దీనిలో శ్లేషపై- ఇది ప్రాచీనత గల కావ్యం కాదేమోనని శంకించినా, శ్లేషమయ కవిత్వం పంపకవి నాటికి కొత్తకాదు. సంస్కృత కన్నడ భాషల్లో శ్లేష కవిత్రం ప్రహతమే. దీనితో పంప మహాకవే తెలుగునాట తొలి కవి అవుతాడు.

# కులగణన తేల్చేదేమిటి?

జన గణనలో కుల గణన కూడా చేర్చాలన్న డిమాండ్‌ను నిరుడు ఏప్రిల్‌లో కేంద్రం అంగీకరించగా, అందుకు అనుసరించబోయే విధానంపై ఎట్టకేలకు స్పష్టత వచ్చింది. పౌరులనుంచి రాబట్టే సమాచారానికి సంబంధించిన 40 ప్రశ్నల్లో కులం కూడా ఒకటిగా ఉండబోతోందని కేంద్రం నోటిఫికేషన్ వెల్లడించింది. అయితే దీనివల్ల ఏ మేరకు ప్రయోజం ఉంటుందన్న సందేహం తలెత్తుతుంది. వివిధ కులాల పేర్లు ఇచ్చి దాన్లో దేనికి చెందుతారో తెలపాలని పౌరుల్ని అడిగితే నిర్దిష్టమైన డేటా వెల్లడవుతుంది. అందుకు బదులుగా వారు చెప్పిన కుల వివరాలు నమోదు చేయటం వల్ల ప్రయోజనం ఉంటుందా? 2011లో యూపీఏ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల గణన అంటూ దేశవ్యాప్తంగా ఒక సర్వే చేసింది. ఎన్నడో 1931లో వలస పాలకుల హయాం తర్వాత దేశంలో కులాలను గణించటం అదే మొదటిసారని అందరూ సంతోషించారు. కానీ ఆ గణనవల్ల ఏ ప్రయోజనమూ కలగలేదు. పౌరులు చెప్పిన వివరాల తర్వాత కులాలు, ఉపకులాలు, అక్షరక్రమంలో తేడాలు తదితరాల ఆధారంగా దాదాపు 46 లక్షల 73 వేల రకాలు నమోదయ్యాయి. కులాలవారీగా వాటిని వర్గీకరించటానికి 2015లో అప్పటి నీతి ఆయోగ్ చైర్మన్ అరవింద్ పనగారియా నేతృత్వంలో కమిటీ ఏర్పాటైంది. తీరా కులాల పేర్లలో ఉన్న అనేక వ్యత్యాసాల కారణంగా అయోమయం ఏర్పడి, ఆ డేటాను అధికారికంగా విడుదల చేయలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి తలెత్తగలదన్న సందేహం చాలామందిలో ఉంది. ఏ కులానికి చెందుతారన్నది తెలియజేసేలా జాబితా రూపొందించి ప్రశ్నించటంవల్ల సమాధానం సులభమవుతుంది. అర్థవంతమైన డేటా లభిస్తుంది. ఒక రాష్ట్రంలో ఉన్న కులం వేరే రాష్ట్రంలో ఉండదు. అలాగే ఒకచోట బీసీగా పరిగణించే కులం మరోచోట ఎస్సీగానో, ఎస్టీగానో ఉండే అవకాశం లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కులాల సేకరణకు అనువైన పద్ధతుల్ని ఎంచుకోవాలి. పార్లమెంటులో ఇందుకు సంబంధించి లోతైన చర్చ జరిగివున్నా, రాష్ట్రాలవారీగా సమావేశాలు నిర్వహించి, ఆ యా ప్రాంతాల్లో ఉండే కులాలు, వర్గాల గురించిన జాబితా ఖరారుచేసివున్నా జాతీయ స్థాయిలో ఏ కులాలు ఏ కేటగిరీ కిందకు వస్తాయో, తీసుకురావాలో ఒక అంచనా వచ్చేది. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో మన దేశం కులం నిర్వహించే పాత్ర తక్కువేమీ కాదు. అణగారిన కులాలు స్వాతంత్ర్యానంతరం విద్యావకాశాలను అందుకోవటం, ఉన్నతోద్యోగాలు సాధించటంవంటివి సాధ్యమయ్యాయి. ఆ మేరకు చైతన్యం పెరిగి జనాభా దామాషా ప్రాతిపదికన అవకాశాలు దక్కటంలేదన్న అసంతృప్తి ఎక్కువైంది. కులగణన డిమాండ్ వెనక ఈ నేపథ్యం ఉంది. దానికి తగిన డేటా లభించేలా ఈ కుల గణన ఉండొద్దా? ఇప్పుడు పౌరులు అందజేసిన వివరాల ఆధారంగా ఎన్యూమరేటర్లు వర్గీకరించుకుని అయిందనిపిస్తారు. అప్పుడది విశ్వసించదగ్గ డేటా అవుతుందా? తమకు అన్యాయం జరిగిందనీ, తమ కుల జనాభాను తగ్గించి చూపారనీ ఆరోపణలు వెల్లువెత్తే అవకాశం కూడా లేదా? ఆ సంగతి అటుంచి ఇతర ప్రశ్నలు గమనిస్తే ఇప్పుడు సేకరిస్తున్నది జనాభా లెక్కలా, పౌర నమోదు చిట్టానా అన్న సందేహం రాకమానదు. 2011 నాటి జనగణనలో 29 ప్రశ్నలుంటే అవి ఈసారి 40కి చేరుకున్నాయి. వీటిలో తల్లిదండ్రుల పేర్లు, వివరాలతో పాటు ఆధార్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, మొబైల్ ఫోన్ నంబర్ వగైరాలున్నాయి. ఈ వివరాల వెల్లడి వ్యక్తిగత గోప్యతకు మంచిదేనా? ఇప్పటికే వివిధ విభాగాలవద్ద ఈ వివరాలుంటాయి. మళ్లీ అవసరమా? 2020 ఏప్రిల్‌నుంచి మొదలుకావాల్సిన జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) ప్రక్రియకు కూడా ఈ మాదిరి ప్రశ్నలే ఉన్నాయి. అది జాతీయ పౌర నమోదు చిట్టా(ఎన్ఆర్‌సీ) కోసమేనని విపక్షాలు ఆరోపించాయి కూడా. అయితే కోవిడ్ అవరోధం కారణంగా అది మూలనబడటంతో వివాదం సద్దుమణిగింది. హిమపాతం అధికంగా ఉండే జమ్మూ కశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో జనగణనలో కీలకమైన ఈ రెండో దశ సోమవారం లాంఛనంగా మొదలైంది. అందుకే కేంద్రం పారదర్శకంగా వ్యవహరించి అన్ని అంశాలూ తేటతెల్లం చేయాలి. ఈ రాష్ట్రాల్లో ఎదురయ్యే సమస్యల ఆధారంగా తగిన సవరణలు తెస్తే వేరే రాష్ట్రాల్లో ఫిబ్రవరిలో మొదలయ్యే జనగణన నాటికి ఒక సమగ్రత ఏర్పడుతుంది.

## ముదురుతున్న వందే మాతరం వివాదం

**లక్నో :** జాతీయ గేయం వందేమాతరం ఆలాపన విషయంలో కాంగ్రెస్ వివాదంలో ఇరుక్కుంది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలపై దుమారం రేగింది. జాతీయ పతాక ఆవిష్కరణ సందర్భంగా వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలాపించకుండా, ఆ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ మధ్యలోనే అడ్డుకున్నారని, ఆపేయమన్నారని విమర్శలు వచ్చాయి. సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి, ఆ పార్టీ నేతలకు, జాతీయ అధ్యక్షుడికి పూర్తి వందేమాతరం ఆలాపించడానికి ఇష్టపడుతున్నట్లు లేదని బీజేపీ విరుచుకుపడుతోంది. కొందరి ఆలోచనా ధోరణి 1947 కి పూర్వం ఎలా వుందో ఆ తర్వాత అలాగే వుందని కూడా విరుచుకుపడుతున్నారు.అలాగే రాజకీయాలకు అతీతులైన వ్యక్తులు కూడా ఈ పరిణామంపై స్పందిస్తున్నారు.బంకిం చంద్ర చటోపాధ్యాయ వారసుడైన సుమిత్రో చటర్జీ కూడా స్పందించారు. జాతీయ గీతం ప్రసారమవుతుండగా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తమలో తాము మాట్లాడుకోవడం తన కుటుంబాన్ని "బాధించిందని" ఆయన పేర్కొన్నారు.అయితే ఈ విమర్శలను కాంగ్రెస్ ఖండిస్తోంది."వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న సమయంలో ఖర్గే నిలబడి ఉన్నారు.. ఆయనకు కుర్చీ వేయాలని మాత్రమే సోనియా సైగ చేశారు. అంతేకానీ.. పూర్తిగేయాన్ని ఆపేయాలని ఆమె కోరలేదు." అని కాంగ్రెస్ వివరించింది. ఈ వివాదంపై స్పందించిన సీనియర్ నేత జైరాం రమేశ్.. "1937, అక్టోబరు 28న కోల్‌కతాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో వందేమాతరం గేయంలోని ప్రారంభ చరణాలను మాత్రమే ఆలపించాలని మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్, రవీంద్రనాథ్‌ఠాగూర్ వంటి పెద్దలు నిర్ణయించారు." అని గుర్తు చేశారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రతికార్యక్రమంలోనూ వందేమాతరం ఆలపిస్తోందని, దీనిపై వివాదం లేదని, వారు సృష్టించారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించామని తెలిపారు.

## తీరుమారని యూజీసీ నెట్ ఎగ్జామ్ రద్దు

**న్యూఢిల్లీ :** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ జూన్ 2026 పరీక్షలకు సంబంధించి ఏకంగా మూడు సబ్జెక్టులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేసింది. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలను తిరిగి నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మూడు పేపర్లలో పలు తప్పులు, లోపాలు ఉన్నాయంటూ అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. జూన్ 2026 పరీక్షలను జూన్ 22 నుంచి 30 వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరం జూలై 5, 2026న రీ-టెస్ట్ నిర్వహించింది. మొత్తం 87 సబ్జెక్టులకు ఈ పరీక్షలు జరిగాయి. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ , అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు. అయితే ఇందులో ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ పేపర్లలో అనేక తప్పులు ఉన్నాయని చాలా మంది అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ లోపాలను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సమగ్రంగా పరిశీలించిన అనంతరం మూడు పేపర్లలో పలు రకాల తప్పులు ఉన్నట్లు గుర్తించింది.కమిటీ నివేదిక ప్రకారం.. ప్రశ్నపత్రాల్లో ప్రముఖ పండితుల పేర్లలో స్పెల్లింగ్ తప్పులు, పుస్తకాల పేర్లలో లోపాలు, ప్రశ్నల పదబంధాల్లో తప్పులు, వ్యాకరణ దోషాలు, లింగం-వచన అన్వయంలో పొరపాట్లు, విరామ చిహ్నాల తప్పులు ఉన్నాయి. అంతేకాకుండా ఇప్పటికే ప్రాచుర్యంలో ఉన్న భావాలకు ప్రామాణికం కాని పదాలను ఉపయోగించడం, గతంలో అడిగిన ప్రశ్నల్లో గణనీయమైన సంఖ్యలో ప్రశ్నలను మళ్లీ ఇవ్వడం వంటి లోపాలు కూడా ఉన్నట్లు కమిటీ గుర్తించింది. అభ్యర్థులందరికీ న్యాయమైన, లోపాలు లేని పరీక్షను నిర్వహించడం అవసరమని భావించిన కమిటీ.. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ మూడు పేపర్లను తిరిగి నిర్వహించాలని సిఫార్సు చేసింది. కమిటీ నివేదిక ఆధారంగా రీ-కండక్ట్‌కు నిర్ణయం తీసుకుంది. ఇంగ్లిష్ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 9, 2026 ? షిఫ్ట్ 1, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కామర్స్ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 9, 2026 ? షిఫ్ట్ 2, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సోషియాలజీ పరీక్ష తేదీ: సెప్టెంబర్ 10, 2026 ? షిఫ్ట్ 1, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ మూడు సబ్జెక్టులకు చెందిన అభ్యర్థుల నుంచి రీ-కండక్ట్ పరీక్ష కోసం ఎలాంటి అదనపు పరీక్ష ఫీజు వసూలు చేయబోమని స్పష్టం చేసింది. పరీక్ష నగరం, పరీక్ష కేంద్రం, అడ్మిట్ కార్డుకు సంబంధించిన వివరాలను తదుపరి దశలో అధికారిక వెబ్‌సైట్ ద్వారా వెల్లడిస్తామని తెలిపింది.

నవగీత
తెలుగు దినపత్రిక
మంగళవారం
18 ఆగస్టు 2026

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా







**కరీంనగర్, ఆగస్టు17,(నవగీతం):** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా డీఆర్వో స్వామి, శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం క్యాంపు కార్యాలయం, చీఫ్ సెక్రటరీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని.. 30 రోజులు దాటిన దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు లాగిన్ లో అప్డేట్ చేయించాలని సూచించారు.పింఛన్ల దరఖాస్తు సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులు ఎవరు మిస్ కావద్దని.. చేసుకోవాలని సూచించారు.యూనిఫామ్ పంపిణీలో ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.పింఛన్ల దరఖాస్తుకు ఫుడ్ సెక్యూరిటీ కార్డు ప్రమాణికంవృద్ధాప్య పింఛన్ మినహా అన్ని పింఛన్ల దరఖాస్తులు స్వీకరిస్తాంప్రతి పంచాయతీ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయూత పింఛన్లకు సంబంధించి ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్డీఓ గీత, మెప్మా పీడీ స్వరూప రాణి మాట్లాడుతూ.. ప్రస్తుతం వృద్ధాప్య పింఛన్లు తప్ప.. మిగతా అన్నింటికీ (ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు తదితరులు) దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.ఒంటరి మహిళలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 35 ఏళ్లు, పట్టణ ప్రాంతాల్లో 40 ఏళ్లు నిండి ఉండాలన్నారు.కొత్త పింఛన్ల దరఖాస్తు కోసం ఆహార భద్రత కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు వివరించారు. నిబంధనలు మార్చలేదని.. గతంలో ఉన్న నిబంధనలనే కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో, మండల కేంద్రంలో, మున్సిపాలిటీలో, నగరపాలికలో పింఛన్లకు సంబంధించి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని.. అనుమానాలు ఉంటే సంప్రదించాలని సూచించారు.గతంలో గ్రామసభలు, వార్డుసభలు, ప్రజా పాలన వారోత్సవాల సమయంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు.. మళ్లీ కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని.. గతంలో ఏవైనా పత్రాలుసమర్పించని వారు, దరఖాస్తు చేయనివారు ఇప్పుడు ప్రభుత్వం సూచించిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తుల పరిశీలన అనంతరం.. అధికారులు ఇంటింటికి వెళ్లి అర్హులను గుర్తిస్తారని పేర్కొన్నారు.

# నేరాల నియంత్రణ, ప్రజా భద్రత, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి: ఎస్పీ అశోక్ కుమార్

**రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతరం నిఘా**

**వార్షిక తనిఖీల్లో భాగంగా మల్యాల సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**





**జగిత్యాల/మాల్యాల, ఆగస్టు17,(నవగీతం)** మల్యాల సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సందర్శించి రికార్డ్స్ ను, పరిసరాలను తనిఖీ చేశారు. సర్కిల్ కార్యాలానికి సంబంధించిన సర్కిల్ ఇన్ఫర్మేషన్ బుక్ , క్రైం రికార్డు , ప్రాపర్టీ రిజిస్టర్, పిటిషన్ రిజిస్టర్ లను పరిశీలించారు.ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ ట్రయల్ కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లను ఎస్పీ పరిశీలించారు.గ్రేవ్ కేసులు, పోక్సో కేసుల్లో నిందితులకు చట్టపరంగా శిక్షలు పడే విధంగా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. ప్రతి కేసులో నిర్దేశిత ఎస్ ఓ పి ప్రకారం దర్యాప్తు కొనసాగించాలని, దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి లోపాలకు తావులేకుండా ఆధారాల సేకరణ, సాక్షుల విచారణ, కేసు డాక్యుమెంటేషన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సీఐ తరచుగా తనిఖీ చేస్తూ, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షించాలని అన్నారు . రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ప్రతి నెలా వారికి సంబంధించిన నూతన సమాచారాన్ని సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, వివిధ సామాజిక అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఉపయోగాన్ని తెలియజేస్తూ గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు.నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సంబంధిత శాఖలతో సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.ఈ సందర్భంగా మల్యాల సర్కిల్ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రవికుమార్, సీఐ రాజ్ కుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు సందీప్, నరేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల స్థాయిలో వినూత్నంగా ప్రజావాణి..

**జిల్లా కేంద్రానికి రాకుండానే సమస్యల పరిష్కారానికి చర్యలు..**

**ప్రజలు ఇబ్బందులు తీర్చేందుకే..**

**కరీంనగర్, ఆగస్టు 17,(నవగీతం)** ప్రజల సమస్యలను జిల్లా కేంద్రానికి రాకుండానే స్థానికంగానే పరిష్కరించేందుకు సోమవారం ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి కరీంనగర్ జిల్లాలో విశేష స్పందన లభించింది. ప్రజల ఇబ్బందులను తగ్గించి, వారి సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే ఉద్దేశంతో జిల్లాలోని 15 మండలాల్లో ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మొత్తం 328 మంది అధికారులు పాల్గొని 704 వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు.
రామడుగు మండలంలో ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 25 మంది అధికారులు పాల్గొని 18 వినతులు స్వీకరించారు. మానకొండూరులో 20 మంది అధికారులు పాల్గొని 14 వినతులు, తిమ్మాపూర్‌లో 23 మంది అధికారులు పాల్గొని 35 వినతులు అందుకున్నారు. గన్నేరువరం రైతు వేదికలో 21 మంది అధికారులు పాల్గొని 9 వినతులను స్వీకరించారు. చొప్పదండి మండలంలో 25 మంది అధికారులు పాల్గొని 57 వినతులు స్వీకరించగా, కరీంనగర్ రూరల్ మండలంలో 18 మంది అధికారులు పాల్గొని 20 వినతులు స్వీకరించారు. గంగాధర మండల ప్రజావాణికి అత్యధికంగా 347 వినతులు అందడం విశేషం. ఇందులో నారాయణపూర్ గ్రామానికి చెందిన ప్రజలు ఏకంగా 307 వినతులు సమర్పించి తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరారు.కొత్తపల్లి మండలంలో 19 మంది అధికారులు పాల్గొని 23 వినతులు,చిగురుమామిడిలో 24 మంది అధికారులు పాల్గొని 27 వినతులు స్వీకరించారు. ఇల్లందకుంటలో 18 మంది అధికారులు పాల్గొని 37 వినతులు, సైదాపూర్‌లో 17 మంది అధికారులు పాల్గొని 9 వినతులు,జమ్మికుంటలో 23 మంది అధికారులు పాల్గొని 15 వినతులు, శంకరపట్నంలో 25 మంది అధికారులు పాల్గొని 15 వినతులు అందుకున్నారు. హుజూరాబాద్‌లో 31 మంది అధికారులు పాల్గొని 33 వినతులు, వీణవంకలో 19 మంది అధికారులు పాల్గొని 45 వినతులను స్వీకరించారు.

**కలెక్టరేట్‌లోనూ..**

మరోవైపు కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజావాణికి కూడా ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. ఆగస్టు 17 నాటికి మొత్తం 225 ఫిర్యాదులు నమోదయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.
కలెక్టరేట్ ప్రజావాణిలో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖ పీడి కరీంనగర్‌కు 56, కరీంనగర్ కార్పొరేషన్‌కు 58 ఫిర్యాదులు అందాయి. కరీంనగర్ ఎస్ డి సి ఎల్ ఏ కార్యాలయానికి 46 గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ కు రెండు దరఖాస్తులు వచ్చాయి.స్త్రీ సంక్షేమ శాఖ కార్యాలయానికి మూడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి 1,బీసీ వెల్ఫేర్ ఒకటి,
టీజీ ఎస్పీడీసీఎల్ 2,
సివిల్ సప్లై ఆఫీస్ 1,
సిపి ఆఫీసు 1,
వెల్ఫేర్ ఆఫీసు 3,
డిపిఓ ఆఫీస్ 3,
ఏ డి ఎస్ ఎల్ ఆర్ 2,
జమ్మికుంట మున్సిపాలిటీ 3,
చొప్పదండి మున్సిపాలిటీ 8
ఏసీఎల్ బి ఆఫీస్ 1,
హుజురాబాద్ మున్సిపాలిటీ
8, డిఇఓ ఆఫీస్ 1,
జి జి హెచ్ 3, మైన్స్ అండ్ జియాలజీ 1,హుజురాబాద్ ఆర్డిఓ ఆఫీస్ 1, కరీంనగర్ ఆర్డిఓ ఆఫీస్ 8,డిపిఆర్ఓ ఆఫీస్ 1,డిస్టిక్ కోఆర్డినేటర్ 1,
రీజినల్ కోఆర్డినేటర్ 3,
వారధి 5,
శాతవాహన యూనివర్సిటీ రిజిస్టర్ 1
దరఖాస్తు వచ్చింది.

**స్థానికంగానే సమస్యలకు పరిష్కార మార్గం**

మండల స్థాయిలోనే ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించడం వల్ల జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజలకు తమ సమస్యలను అధికారులకు వివరించే అవకాశం లభించింది. సంబంధిత శాఖల అధికారులు అక్కడికక్కడే సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా ప్రజావాణి దోహదపడుతోంది.
మొత్తంగా మండల స్థాయి ప్రజావాణిలో 704 వినతులు, జిల్లా స్థాయి ఆర్డీవో కార్యాలయాలు మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 225 ఫిర్యాదులు అందాయి. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం విస్తృతంగా అందుబాటులో ఉందనే భరోసా కల్పించింది. అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖలు పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## కొండగట్టు వద్ద ఆర్టీసీ బస్సు- లారీ ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం

**జగిత్యాల, ఆగస్టు17,(నవగీతం)** జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద కరీంనగర్ – జగిత్యాల ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనపై రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై జగిత్యాల జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు, పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య సహాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే, బాధిత కుటుంబాలకు అండగా ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను ఆర్టీసీ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ప్రమాద ఘటనపై సమగ్ర వివరాలు సేకరించి, బాధితులకు తక్షణ సహాయం అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**







**జగిత్యాల,ఆగస్టు17,(నవగీతం):** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 41 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇక నుండి జిల్లా అధికారులు అన్ని ఫైల్స్ ఈ ఆఫీసు ద్వారా మాత్రమే పంపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బి.ఎస్.లత, బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచిన్నజీయర్ స్వామి సప్తతి తిరునక్షత్ర శ్రీరామ కలశహృదయయాత్ర...

**అష్టాక్షరి, పంచాక్షరి ల ఏకత్వమే శ్రీరామ నామం**



**రాయికల్,ఆగస్టు17,(నవగీతం):** రాయికల్ మండలంలో కొత్తపేట శ్రీ నాగాలయంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర శ్రీరామ హృదయ కలశ యాత్ర ఘనంగా జరిగింది. అర్చకులు చెరుకు రాజేశ్వర శర్మ, వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్, గుగ్గిల్ల రాములు శ్రీరామ కలశం, చిన్నజీయర్ స్వామివారి చిత్రపటాన్ని సర్పంచ్ లు మీనుగు రాజగంగు అంజయ్య, ఒడ్డెర కాలనీ సర్పంచ్ పల్లపు వెంకటేష్, శ్రీరాజరాజేశ్వర నాగాలయ చైర్మన్ దానవేని రాము యాదవ్ లకు అందజేశారు. అనంతరం"జై శ్రీరామ్" నినాదాలతో భక్తిశ్రద్ధలతో పాదయాత్ర నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరిహరుల ఏకత్వ నామమే శ్రీరామ నామమని, అష్టాక్షరిలో రా పంచాక్షరిలో మ అక్షరాలతో ఏర్పడినదే శ్రీరామ నామమని భగవత్ నామస్మరణతోనే దేశానికి, ధర్మానికి రక్షణ లభిస్తుందని, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. లోకకల్యాణం, దేశానికి,ధర్మానికి రక్షణ, ధర్మపాలకుల పరిరక్షణ, ధర్మస్థాపన జరగాలని శ్రీరాముడిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చింతలపెల్లి గంగారెడ్డి, చంద్రశేఖర్, దానవేని సతీష్, చెట్పెల్లి గౌతమ్, ఆలయ ఏవో విక్రమ్ గౌడ్, బేక్కం తిరుపతి, గాజవేణి సురేష్, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కొడిమ్యాలలో ప్రతి సోమవారం ప్రజావాణి

**తొలిరోజే 12 దరఖాస్తులు**



**కొడిమ్యాల, ఆగస్టు 17,(నవగీతం):** కొడిమ్యాల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన తొలి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 12 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ,శాఖకు నాలుగు పంచాయతీరాజ్ శాఖకు నాలుగు చొప్పున, గృహాలకు సంబంధించి రెండు, పరిశ్రమలు, ఆర్అండ్‌బీ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి, సమస్యలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. దరఖాస్తుల పరిష్కార వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, దరఖాస్తుదారులు తమ ఫిర్యాదు పురోగతిని ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో స్వరూప కోరారు.

# కల్యాణలక్ష్మి పథకం రద్దుకు కాంగ్రెస్ కుట్ర సుంకే రవిశంకర్

**కొడిమ్యాల, ఆగస్టు 17.(నవగీతం)**

కొడిమ్యాల మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టి, తహసీల్దార్ నరేష్ కు వినతిపత్రం అందజేశారు.కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసే కుట్రలను కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ డిమాండ్ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ప్రశ్నించారు.కోర్టు అంశాన్ని సాకుగా చూపి పథకాలను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.పేదింటి ఆడబిడ్డల వివాహం తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో 2014లో అప్పటి ముఖ్యమంత్రి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు.కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది లబ్ధిదారులకు ఈ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించినట్లు పేర్కొన్నారు.కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇవ్వాల్సి వస్తుందనే కారణంతోనే పథకాన్ని తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి అర్హులైన పేద




కుటుంబాలకు ప్రయోజనం అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# బి.ఆర్.ఎస్.నాయకుల తప్పుడు ప్రచారాలను మానుకోవాలి.

**మంగపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు.**

**ములుగు,ఆగస్టు17,(నవగీతం):** ములుగు జిల్లా మంగపేట మండలంలోని జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు గుంటూరు సతీష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు చేస్తున్న తప్పుడు ప్రచారాలను మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు.

సోమవారం ఆయన మాట్లాడుతూ కొన్ని పత్రికల్లో ములుగు జిల్లా అభివృద్ధిపై వస్తున్న కథనాలు అవాస్తవాలని అన్నారు.

సతీష్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ,

గుంటూరు సతీష్ రెడ్డికి మా తెలంగాణతో ఏం సంబంధమని ప్రశ్నించారు.ఆయన ఒక వలస వాది అని, ప్రస్తుతం ఉంటున్న ఊరిలో ఒక్క వార్డ్ నెంబర్‌ను కూడా గెలిపించలేని ఆయన మంత్రి పై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు.

గతంలో ఎంపీటీసీకి పోటీ చేసి ఓడిపోయిన ఆయన చిల్లర వేషాలు మానుకోవాలని హెచ్చరించారు. స్థాయి మరిచి మాట్లాడితే ఫలితం కూడా అదేవిధంగా ఉంటుందని, మాట్లాడే ముందు జాగ్రత్త వహించడం ముఖ్యం అని తెలిపారు.

గతంలో సెల్ ఫోన్లలో శాండ్ కుంభకోణం అని ఆరోపించినా ఒక్కటి కూడా నిరూపించలేకపోయారని, కోర్టుమొట్టికాయలు వేసినా సిగ్గు లేకుండా మళ్లీ 12 కోట్ల క్యూబిక్ మీటర్ల శాంక్షన్ అయ్యిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

నిజంగా నీకు చీము నెత్తురు ఉంటే బహిరంగ చర్చకు రావాలని, గతంలో కూడా ఎన్నిసార్లు సవాల్ విసిరినా ఒక్కసారి కూడా నిరూపణకు రాలేదనీ, మీకు, మీ పార్టీకి విమర్శలు చేసే అర్హతకూడా లేదని స్పష్టం చేశారు.

బి.ఆర్.ఎస్.జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు, బిక్షపతి విమర్శలు చేయడం సరికాదని



ప్రకృతి విపత్తు వస్తే సీఎం బాధ్యత అంటూ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు చేసిన వ్యాఖ్యలను ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. గతంలో మేడారం, కొండాయి వద్ద వరదల వల్ల జరిగిన సంఘటనలకు, షార్ట్ సర్క్యూట్‌తో ఊరు దగ్ధమైనప్పుడు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు.

మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని విచారం వ్యక్తం చేశారు.

అదేవిధంగా నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకురాలు మంత్రి సీతక్క.ములుగు జిల్లా రావడంలో ఆమె పాత్ర లేదని బిక్షపతి అనడం హాస్యాస్పదమన్నారు.

గతంలో అసెంబ్లీలోనే "మా సీతక్క అడిగితే జిల్లా ఇచ్చాం" అని గత ప్రభుత్వంలో మీ నాయకుడే చెప్పారని గుర్తు చేశారు.

మంగపేటలో అభివృద్ధి

మంగపేట మండలానికి వందల కోట్ల రూపాయలతో బి.టి.రోడ్లు, సి.సి.రోడ్లు, నూతన పాఠశాలలు, కంటైనర్ పాఠశాల భవనాలు, పంచాయతీ కార్యాలయాలు, దేవాలయాలు, బ్రిడ్జీలు, అత్యాధునిక బస్ స్టాండ్, సెంట్రల్ లైటింగ్, ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు.

ప్రజా ప్రభుత్వంలో ములుగు జిల్లా అభివృద్ధిలో పరుగులు పెడుతుంటే చూసి ఓర్వలేని బి.ఆర్.ఎస్. నాయకులు నిత్యం ఆదివాసీ ఆడబిడ్డ సీతక్క పై విమర్శలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు.

ప్రతిపక్ష పార్టీగా అభివృద్ధిపై ప్రజల మధ్య ఉండి సమస్యల పరిష్కారానికి సూచనలు చేయాలని మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన సూచిస్తున్నామని తెలిపారు..

# కార్పొరేట్ తరహా విద్యా, వైద్యం ప్రభుత్వ లక్ష్యం

**ఆసుపత్రుల్లో సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత**

**నిరుపేదల సంక్షేమం, ఆరోగ్యానికి పెద్దపీట**

**జిజిహెచ్ లో శానిటేషన్ పై దృష్టి పెట్టాలి**

**మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ**

**ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం**







**కరీంనగర్,ఆగస్టు17,(నవగీతం)** కార్పొరేట్ తరహా విద్య, వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామని మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది.ఈ సమావేశానికి హాజరైన కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాల కల్పనకు, నూతన భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తోందని తెలిపారు. వైద్య రంగంలో మెడికల్ కళాశాలలు అత్యంత కీలకమని అన్నారు. వీటికి అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రులకు నిరుపేదలు ఎక్కువగా వస్తుంటారని, వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్ పై దృష్టి పెట్టాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రి అవుట్ పోస్ట్ వద్ద పోలీసు భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆస్పత్రిలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, ఇంజనీరింగ్ మున్సిపల్ అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధి కోసం 40 లక్షల రూపాయల మంజూరు చేశామని తెలిపారు. ఆస్పత్రిలో కనీస అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి అవసరమైన సహకారం అందిస్తామని అన్నారు. జి జి హెచ్ లో సెక్యూరిటీ లోపం లేకుండా చూడాలని, అవసరమైతే మరింత మందిని నియమించాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాల్లో పారిశుద్ధ్యంతో పాటు పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.ఆస్పత్రి అభివృద్ధి సంఘం చైర్ పర్సన్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఒక హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇది ప్రజలతో పాటు అధికారులు ప్రజాప్రతినిధులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సదరం, వెల్నెస్ సెంటర్, మందులు ఇచ్చే చోటు, చాలా ముఖ్యమైనవని, ఇక్కడ రోగులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల క్రమం తప్పకుండా వేతనాలు అందించడంతోపాటు వారి సేవలను పర్యవేక్షించాలని అన్నారు. ఆస్పత్రికి వచ్చే వివిధ రకాల ఆదాయాలపై దృష్టి పెట్టాలని, తద్వారా మరింత అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఆస్పత్రి కనీస అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి సంఘం ఆమోదం పొందిన పనులు నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా వైద్యాధికారి, జి జి హెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ తక్యుద్దీన్ ఖాన్, ఆర్ఎంవో నవీన, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# రైతులు, పేదల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**భాజపా కిసాన్ మోర్చా నాయకులు ఆపద వెంకట రామారావు**

**తల్లాడ, ఆగస్టు 17 (నవగీతం):** రైతులు మరియు పేదలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని భాజపా కిసాన్ మోర్చా జిల్లా నాయకులు ఆపద వెంకట రామారావు డిమాండ్ చేశారు. సోమవారం తల్లాడ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక ప్రజలు, రైతులు, బాధితులతో కలిసి ఆయన అధికారులకు వినతిపత్రం అందజేశారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్నారుగూడెం గ్రామంలోని నిరుపేదలకు వెంటనే పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అన్నారుగూడెం క్లస్టర్‌కు శాశ్వతంగా ఏఈఓ (వ్యవసాయ విస్తరణ అధికారి)ను నియమించాలని కోరారు. ఏఈఓ లేకపోవడంతో రైతులు విత్తనాలు, ఎరువులు, సాగు సలహాలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ?సిరిపురం మేజర్ కాలువకు సీతారామ ప్రాజెక్టు ద్వారా తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని, లేదంటే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువ విస్తరణ పనుల వల్ల నష్టపోయిన రైతులందరికీ




న్యాయమైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాలువ నిర్మాణం కారణంగా ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీవాసులకు పక్కా ఇళ్లు కేటాయించి పునరావాసం కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే భాజపా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ?ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు వాడవల్లి నాగేశ్వరరావు, గాదె కృష్ణారావు, స్థానిక ప్రజలు, బాధితులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారం శ్రీ రాజరాజేశ్వర నాగాలయం





**రాయికల్ ,ఆగస్టు 17,(నవగీతం)** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం,కొత్తపేట శ్రీ రాజ రాజేశ్వర నాగాయం యందు సోమవారం రోజున నాగుల పంచమి సందర్భంగా పుట్టలో పాలు పోసి మొక్కలు తీర్చుకుంటున్న భక్తులు. ఉదయం ప్రత్యేక అభిషేకములు, అర్చన పూజలు ఆలయ అర్చకులు చెఱకు రాజేశ్వర శర్మ వైధిక నిర్వహణలో నిర్వహించారు. అనంతరం చింతలపెల్లి విజయ - గంగారెడ్డి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమం లో రాయికల్ తహశీల్దార్ నాగార్జున, ఎంపిడిఓ చిరంజీవి, జిపిఓ దశ కుమార్ మరియు ఈవో ఎం.విక్రమ్, ఆలయ చైర్మన్ దానవేని రాము, ధర్మకర్తలు పల్లపు వెంకటి, ముక్కెర ముత్యం, సత్య నారాయణ రావు, సతన్న, కొత్తపేట సర్పంచ్ మీనుగు రాజ గంగు - అంజయ్య, ఉప సర్పంచ్ తునికి రంజిత్, ఒడ్డెర కాలనీ సర్పంచ్ చంద్ర శేఖర్, ఉప సర్పంచ్ రాజేష్, మాజీ సర్పంచ్ బత్తిని రాజేశం, మాజీ ఉప సర్పంచ్ రాజ శేఖర్ మరియు పలు ఆలయాల సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి అని ప్రజావాణిలో వినతి




**రాయికల్,ఆగస్టు 17(నవగీతం)** భూపతిపూర్ గ్రామంలో ప్రధాన రహదారి వెంట మరియు పెద్దమ్మ గుడి కి గత రెండు నెలలుగా పంచాయితీ రాజ్ శాఖ విద్యుత్ శాఖ ల సమన్వయ లోపం వలన విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజావాణి లో ఫిర్యాదు చేసిన మాజీ ఉపసర్పంచ్ అన్నవేణి వేణు.ఇట్టి ఫిర్యాదులో రహదారి వెంట ఉన్న చెట్ల కొమ్మలు వలన విద్యుత్ వైర్లు తెగిపోయి గత రెండు నెలలుగా విద్యుత్ ఆగిపోయింది పంచాయతీ రాజ్ శాఖ వారు చెట్లు కొట్టడానికి పెర్మిషన్ లేదు అంటున్నారని కానీ చెట్లు కొడితేనే విద్యుత్ పునారిద్దరిస్తామని విద్యుత్ శాఖ వారు అంటున్నారని ఇది పరిష్కారం లేని సమస్య గా మారింది అని దీనికి తగిన పరిష్కారం చూపాలని అలాగే హై స్కూల్ దాటిన తర్వాత పెద్ద మూలమలుపు ఉందని అక్కడ చెట్లు బాగా పెరిగి అవతలి వారు కనిపించక ప్రమాదం జరిగే అవకాశం ఉందని దానికి కూడా తగిన పరిష్కారం చూపాలని కోరడం జరిగింది గతంలో నేను ఉపసర్పంచ్ గా ఉన్న సమయంలోనే వైర్ల కింద చెట్లు వద్దని ఫిర్యాదు చేసానని కానీ అప్పటి ప్రభుత్వం అట్టి ఫిర్యాదుని పట్టించుకోలేదు అని ప్రజలు ప్రభుత్వాన్ని మార్చింది అభివృద్ధి ఆశించి కానీ గత ప్రభుత్వం విధానలే అమలు చేయమని కాదు అని ప్రజలకు అనుగుణంగా సమస్యలు పరిష్కరించాలని కోరడం జరిగింది.

# బి.ఆర్.యస్ శ్రేణుల నిరసన



**రాయికల్,ఆగస్టు17,(నవగీతం)** గత ప్రభుత్వంలో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతిష్టత్మకంగా ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మీ,షాదీముబారక్ పథకాలను నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్య తీరును ఖండిస్తూ మరియు ఆర్హులైన వృధులకు,బీడి కార్మీకులకు ఆసరా పించన్ లో అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ రాయికల్ మండల మరియు పట్టణ బి.ఆర్.యస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నిలిపివేసిన ప్రజా సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలి,రైతు భీమా ప్రీమియంను వెంటనే చెల్లించాలని,రైతులకు ఎలాంటి ఆంక్షాలు లేకుండా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలి మరియు విద్యార్థులకు నిలిపివేసిన ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరడం జరిగింది. లేనియడల బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతుని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో ఆఫీస్ నందు ప్రజావాణి దరఖాస్తు సమర్పించడం జరిగింది. ఈ కార్యకమంలో మండల మరియు పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేష్,ఎలిగేటి అనిల్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి ,కౌన్సిలర్లు రాకేష్ నాయక్ , సర్పంచ్ గుమ్మడి సంతోష్,ప్రధాన కార్యదర్శులు రత్నాకర్ రావు, మహేష్ గౌడ్, నాయకులు కొయ్యాడి మహిపాల్ రెడ్డి , మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య, నాగరాజు, గంగాధర్, ఎనుగంటి రవి, సుధీర్ రెడ్డి,కన్నక మహేందర్,అత్తినేని గంగారెడ్డి, చాంద్ పాషా,దివాకర్ రెడ్డి,ప్రశాంత్ రావు, రాజేందర్ గౌడ్, కోసరి మహేష్, మురళి, రమాపతిరావు, రాజేశ్వర్రావు,రోట్టె శ్రీను, శివనీతి గంగారెడ్డి, సోహైల్, సుతారి తిరుపతి, నరేష్, నవీన్, షాకీర్, గంగమల్లయ్య, సత్యనారాయణ,అనుమల్ల మహేష్, రాంప్రసాద్, జానా గంగాధర్, మహేందర్ యాదవ్, కట్కం సాయి,రాజేష్, కొమ్ముల గంగారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, జలపతిరెడ్డి, రమణారెడ్డి, నరేష్ గౌడ్ , చంద్రయ్య, రాంచంద్రరావు, తిరుపతిరెడ్డి, చిలక శ్రీను,పురుషోత్తం,నాగుల మహేష్, పడాల సత్యం, మధు, రాజు, దారవత్ శ్రీను, సత్యంగౌడ్, లక్ష్మారెడ్డి, మంగిలాల్, బుజ్జక్క, అదిత్య, నర్సింహారెడ్డి,శేఖర్, అస్లాం,సాగర్ పెద్ద సంఖ్యలో బి.ఆర్.యస్ శ్రేణులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

**దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు**

**ఆగస్టు నెలాఖరులోగా టెండర్లు పూర్తి చేసి సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించాలి**

**పుష్కరాల ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులు, కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి**

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి వారం పనుల పురోగతిని సమీక్షించాలి**

**గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పై గోదావరి నది పరివాహక జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన దేవాదాయ శాఖ కమిషనర్**





**జగిత్యాల, ఆగస్టు-17,(నవగీతం)** 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు గోదావరి నది పరివాహక జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం గోదావరి పరివాహక జిల్లాల కలెక్టర్లతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పై జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఆగస్టు నెలాఖరులోగా అన్ని టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి సెప్టెంబర్‌లో పనులను ప్రారంభించాలని తెలిపారు. ఇందుకు అనుగుణంగా అధికారులు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు జరుగుతాయని, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు పుణ్యస్నానాల కోసం వచ్చే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, విద్యుత్, వైద్య సేవలు తదితర అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.1,000 కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు.అధిక సంఖ్యలో భక్తులు వచ్చే టైయర్-1 ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులను నియమించాలని, అవసరమైన కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పుష్కరాల ఏర్పాట్లను సమర్థవంతంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, దేవాదాయ, ఇరిగేషన్, టూరిజం, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రధాన పుష్కర ప్రాంతాలకు అంతరాయం లేని రహదారి అనుసంధానం కల్పించాలని, అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ పనులను చేపట్టాలని తెలిపారు.

పుష్కరాల కోసం చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు

**టైయర్-2 ప్రాంతాల్లో రూ.135 కోట్ల పనులు**

టైయర్-2 ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులకు ప్రభుత్వం మొత్తం రూ.135 కోట్ల నిధులు కేటాయించిందని కమిషనర్ తెలిపారు. ఆయా పనులకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరగా ఖరారు చేసి టెండర్లు పిలవాలని, స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేపట్టాలని సూచించారు. పనులు త్వరగా ప్రారంభించాల్సిన ప్రాంతాల్లో అవసరమైతే షార్ట్ టెండర్లను నిర్వహించాలని తెలిపారు. ఎల్1 ఖరారైన వెంటనే అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి చేసి పనులను క్షేత్రస్థాయిలో ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి పనికి నిర్దిష్ట లక్ష్యాలను నిర్ణయించుకుని ముందుకు సాగాలని, ప్రతి వారం పనుల పురోగతిని సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో తలెత్తే చిన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు.ప్రధాన పుష్కర ప్రాంతాల్లో పనులు వేగవంతం చేయాలి భద్రాచలం, కాళేశ్వరం, ధర్మపురి, బాసర వంటి ప్రధాన పుష్కర ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధి, మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. పుష్కరాల సమయానికి అన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి అదనంగా రూ.15 కోట్ల నిధులు అవసరమని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే సమర్పించామని తెలిపారు. ఈ నిధులతో చేపట్టే 46 పనుల అమలు బాధ్యతను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించాలని కోరారు.46 పనులకు విడివిడిగా పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తే జిల్లా స్థాయిలోనే టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులను ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే అవసరమైన భూసేకరణ కోసం రూ.8 కోట్ల నిధులను అత్యవసరంగా మంజూరు చేయాలని కోరారు.

జగిత్యాల జిల్లాలో టైయర్-1 పనుల పురోగతి

ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ధర్మపురికి రూ.22.16 కోట్లు, కోటిలింగాలకు రూ.16.13 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఈ పనులు టెక్నికల్ ఎవాల్యుయేషన్ దశలో ఉన్నాయని, సెప్టెంబర్ 1, 2026 నుంచి పనులు ప్రారంభించి మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ధర్మపురికి రూ.10 కోట్లు, కోటిలింగాలకు రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తై ఎల్ 1 ఖరారైన నేపథ్యంలో పనులు ప్రారంభించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ధర్మపురిలో 10 పనులకు రూ.50.55 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం టెండర్ ప్రక్రియ ప్రారంభ దశలో ఉందని, పనులను త్వరగా ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.టైయర్-2 పనులకు రూ.12 కోట్లు జగిత్యాల జిల్లాలో ఇరిగేషన్ శాఖకు ుఅవతీ-2 పనుల కోసం రూ.12 కోట్ల నిధులుమంజూరయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆయా పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, టెండర్ ప్రక్రియలను వేగవంతం చేసి పుష్కరాల నాటికి అవసరమైన మౌలిక వసతులను సిద్ధం చేసేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, నిర్ణీత లక్ష్యాలు, గడువుల ప్రకారం పనులను పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి. రాజ గౌడ్, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని గ్రామదేవతలకు, ఆలయాల్లో విశేష పూజలు.

**తల్లాడ మండలంలో సర్వమత సమైక్యతకు ప్రతీకగా నిలిచిన వేడుకలు..**

**జలాభిషేకాలు, మకర తోరణాలు సమర్పించిన భక్తులు.**



తల్లాడ ఆగస్టు 17(నవగీతం): సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ తల్లాడ మండల ప్రజలు శనివారం సమిష్టిగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.మండల పరిధిలోని గ్రామదేవతలకు భక్తులు భక్తిశ్రద్ధలతో జలాభిషేకం చేసి, మకర తోరణాలను సమర్పించారు.ఈ సందర్భంగా స్థానిక శివాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. గ్రామాలు సుభిక్షంగా ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలు తొలగిపోవాలని భగవంతుడిని ప్రార్థించారు.

**సర్వమత సమైక్యతకు వేదిక:**

ఈ పూజా కార్యక్రమాల్లో కులమతాలకు అతీతంగా మండల ప్రజలందరూ ఏకతాటిపైకి రావడం విశేషం. అన్ని కులాల మహిళలు, పెద్దలతో పాటు ముస్లిం సోదరులు, ఇతర మతస్థులు కూడా ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామాల క్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పాల్గొనడంతో మండలంలో సర్వమత సమైక్యత, సోదరభావం ఉట్టిపడింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, నంబూరి మోహన్రావు, కోదూరి నాగేశ్వరరావు,దగ్గుల రాజశేఖర్ రెడ్డి,దగ్గుల శ్రీనివాసరెడ్డి, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికుల పెన్షన్లు కొనసాగించాలని బిఆర్ఎస్ నాయకుల ధర్నా

**పెన్షన్ల కోసం రోడ్డెక్కిన మహిళలు**





**ఇబ్రహీంపట్నం ,ఆగష్టు 18 ( నవగీతం )** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం మండల కేంద్రం ఇందిరమ్మ, ప్రాంగణం వద్ద బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బీడీ కార్మిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.బీడీ పెన్షన్లు అర్హులైన వృద్దులకు వృద్ధాప్య పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని అన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,బీడీ కార్మికులకు, వృద్దులకు, పెన్షన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించకూడదన్నారు. సంక్షేమ పథకాల కింద లబ్దిదారులకు అందాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పథకాల కింద లబ్దిదారులకు రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు.అనంతరం ఇందిరమ్మ ప్రాంగణం నుంచి ర్యాలీగా వెళ్లి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో )కు వినతిపత్రం అందజేశారు.ఎంపీడీవో సి హెచ్ గణేష్, మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం నుండి వచ్చే ఏడు రకాల సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బద్దం గోపి, మాజీ సర్పంచ్ నేమురి సత్యనారాయణ,ఏలేటి చిన్న రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు నేమురి నరేష్, జిల్లాల పవన్, బి ఆర్ఎస్, సీనియర్ నాయకులు మామిడి సురేష్ రెడ్డి, దొంతుల తుక్కారం, దోమకొండ చిన్న రాజన్న, సల్కశీ చిన్న నర్సయ్య, తోకల శేఖర్, మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు తూట్లు పొడిచే కుట్ర

**నరదాసు లక్ష్మణ్‌రావు**

**కరీంనగర్** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు చట్టబద్ధత లేకుండా చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్‌రావు ఆరోపించారు. తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని అమలు చేయలేక పథకాలపై హైకోర్టులో కేసులు వేయించి స్టే వచ్చేలా చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర పిలుపు మేరకు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశాలతో నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నరదాసు లక్ష్మణ్‌రావు, చల్ల హరిశంకర్ తదితరులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు చట్టబద్ధత కల్పిస్తూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,

## తల్లాడలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో వినతి



**తల్లాడ, ఆగస్టు 17(నవగీతం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ప్రజావాణి' మొదటి కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి వినతిపత్రం అందజేశారు. తల్లాడ మండల కేంద్రంలో సిటీ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భద్రాచలం, కొత్తగూడెం, సత్తుపల్లి, రాజమండ్రి ప్రాంతాలకు తల్లాడ ప్రధాన కూడలిగా ఉందని తెలిపారు. ఇక్కడ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతం మరింత సుందరంగా మారుతుందని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా ఉన్నతాధికారులతో మాట్లాడి దీనిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ?ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, దీవెల కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ మూకర ప్రసాద్, అన్నారంగుడెం మాజీ ఎంపీటీసి తాళ్ళ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడలో వర్షాలు కురవాలని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



**తల్లాడ, ఆగస్టు 17 (నవగీతం):** సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ సోమవారం తల్లాడ పట్టణంలో రైతులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ మహిళలు, రైతులు, వ్యాపారవేత్తలు బిందెలతో అమ్మవార్లకు నీరు సమర్పించి వర్షం కోసం ప్రార్థించారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ?ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, గ్రామదేవతల అనుగ్రహం కోసం పట్టణ వాసులు ఈ పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, నంబూరి మోహన్ రావు, రెడ్డెం వీర మోహన్ రెడ్డి, షేక్ ఈసూబ్, గుంటుపల్లి వెంకటయ్య, దగ్గుల శ్రీనివాసరెడ్డి, కొమ్మినేని రామయ్య, దగ్గుల రాజశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భద్రారెడ్డి, గుండ్ల వెంకటేశ్వర్లు, మొక్కా బసవయ్య, మొక్క కృష్ణ అర్జున్, కేసర వెంకటేశ్వర రెడ్డి, రామారావు, లగడపాటి నెహ్రూ, వేమశెట్టి నాగన్న, చంద్రావు, మంగయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టులో స్టే కారణంగానే పథకం అమలులో జాప్యం...

**పథకాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**.పదేళ్ల తర్వాత రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్ల మంజూరు**



**రాయికల్ ,ఆగస్టు 17 (నవగీతం)** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలైన కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాల చట్టబద్ధతను సవాలు చేస్తూ అడ్వకేట్ విజయ్ గోపాల్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా చెక్కుల పంపిణీలో జాప్యం ఏర్పడిందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్ అన్నారు.సోమవారం రాయికల్ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ అర్హులైన నిరుపేద ఆడ బిడ్డ కుటుంబానికి కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ హైకోర్టు పిటిషన్ తోనే జాప్యం ఏర్పడిందని తెలిసి కూడా బిఆర్ఎస్ నాయకులు రోడ్డెక్కి ధర్నా చేయడం విడురంగా ఉందన్నారు. అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సంక్షేమ పథకాల అమలను చూసి ఓర్వలేక ఉనికి కోసమే నిరసన తెలుపుతున్నారన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు అధికారం చేపట్టిన గడిచిన 10ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లను,పెన్షన్ ఇవ్వలేదని 2 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను,ఉచిత బస్సు,ఉచిత విద్యుత్తు, సన్నబియ్యం వంటి మహోన్నత కార్యక్రమాలను అమలు చేసిందన్నారు.గత బిఆర్ఎస్ పాలనలో పెన్షన్ వచ్చే భర్త మృతి చెందితే భార్యకు వితంతు పింఛన్ వచ్చేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం 7 రకాల పింఛన్ల కు ప్రభుత్వం దరఖాస్తుకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు.ప్రజలు సంతోషంగా పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారని వారిని తప్పుదోవ పట్టించేందుకు నిరసనలు చేపట్టడం ఏంటని ప్రశ్నించారు.అర్హులైన వారు ఈపాస్ ద్వారా కల్యాణ లక్ష్మి ,షాది ముబారక్ దరఖాస్తులు తీసుకుంటుందని రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేస్తున్నారని పథకం అమలు ఎక్కడ ఆగలేదన్నారు.బీడీ పెన్షన్ టేకేదార్ పెన్షన్ లేబర్ అధికారుల ద్వారా ప్రభుత్వం సర్వే చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, నాయకులు పిప్పోజి మహేందర్ బాబు,సుధావేణి మురళి,అల్లే పురుషోత్తం,సుదర్శన్,ముక్కెర ప్రసాద్ , అనుమండ్ల చంద్ర తేజ,కాసవేని రాజేష్, గట్టు నవీన్, కొత్తపెల్లి అరవింద్, కటుకం సాయి తదితరులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
మంగళవారం
18 ఆగస్టు 2026

# అలా చేస్తే కెరీర్ వేరేలా ఉండేది



'డాక్టర్ కావాలనుకొని యాక్టర్ అయ్యాను' అని చాలామంది హీరోయిన్లు చెబుతుంటారు. సాయిపల్లవి, శ్రీలీల లాంటి హీరోయిన్లయితే.. డాక్టర్ చదివి కూడా యాక్టర్లయిపోయారు. మలయాళ మందారం ఐశ్వర్య లక్ష్మి కూడా వారి దారిలోనే డాక్టర్ చదివి యాక్టరై విజయాలను అందుకుంటున్నది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'అనుకున్నది జరక్కపోవడమే జీవితం. నన్ను డాక్టర్‌గా చూడాలని మా అమ్మానాన్నల కోరిక. నేను కూడా కష్టపడి హౌస్ సర్జన్ చేశాను. ప్రాక్టీస్ మొదలుపెడితే నా కెరీర్ వేరేలా ఉండేదేమో. కానీ నేను అనుకోకుండా మోడలింగ్ వైపు మళ్లాను. తర్వాత సినిమా పిలిచింది. తొలినాళ్లలో అమ్మానాన్నకు నా ప్రవర్తన మింగుడు పడలేదు. విజయాలు రావడం, నా నటనను అంతా మెచ్చుకోవడం.. ఇవన్నీ చూసి వాళ్లు కూడా సైలెంట్ అయిపోయారు' అంటూ ఐశ్వర్య లక్ష్మి చెప్పుకొచ్చింది. సాయిదుర్గతేజ్‌కు జోడీగా ఆమె నటించిన 'సంబరాల ఏటిగట్టు' సినిమా త్వరలోనే విడుదల కానున్నది.




# యథార్థ సంఘటనలతో..!

సామ్రాట్, డీమోన్ పవన్, లిఖిత ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సాం3'. కృష్ణమాయ దర్శకత్వంలో వి.విజయ నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకానుంది.. ఆదివారం టీజర్‌ను రిలీజ్ చేశారు. యథార్థ సంఘటనల ఆధారంగా సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో తాను త్రివిక్రమరాజు అనే వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తానని హీరో సామ్రాట్ తెలిపారు. భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిగ్‌బాస్ సెలబ్రిటీలు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాయికార్తీక్, దర్శకత్వం: కృష్ణమాయ.

# నాన్‌స్టాప్‌గా 'రాపో23'

హీరో రామ్ పోతినేని స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న తాజా చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. 'రాపో23' వర్కింగ్ టైటిల్‌తో సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే పుదుచ్చేరి శివార్లలో 24 గంటల పాటు నిర్విరామంగా ఈ సినిమా షూటింగ్‌ను జరిపారు. హీరోగా, దర్శకుడిగా ఈ సినిమా కోసం రామ్ ఎంతగానో శ్రమిస్తున్నారని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారని యూనిట్ వర్గాలు తెలిపాయి. 'పుదుచ్చేరిలో వేసిన భారీ సెట్‌లో తొమ్మిది రోజుల పాటు షూటింగ్ జరిపాం. ఇటీవల వర్షాల కారణంగా షెడ్యూల్‌కు బ్రేక్‌పడింది. త్వరలో మళ్లీ షూటింగ్‌ను మొదలుపెడతాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, నిర్మాత:కృష్ణ పోతినేని.






# నవంబర్‌లో యాక్షన్ షురూ?

అల్లు అర్జున్‌తో లోకేష్ కనకరాజ్ సినిమా ప్రకటన వెలువడిన నాటి నుంచి అభిమానులు ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ అప్‌డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'పుష్ప' ఫ్రాంఛైజీ సినిమాలతో బన్నీ ఇమేజ్ తారాస్థాయికి చేరింది. మరోవైపు యాక్షన్, మాఫియా కథాంశాలతో వరుస హిట్స్ అందిస్తూ సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేశారు దర్శకుడు లోకేష్ కనకరాజ్. దాంతో వీరిద్దరి కాంబినేషన్ సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ సినిమా కోసం లోకేష్ కనకరాజ్ తన పంథాకు భిన్నంగా వినూత్న కథాంశాన్ని సిద్ధం చేస్తున్నారని, పౌరాణిక..ఫాంటసీ అంశాలు కలబోసిన కథ ఇదని వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా నవంబర్‌లో సెట్స్‌మీదకు రానుందని తెలిసింది. బాలీవుడ్‌కి చెందిన ఓ అగ్ర హీరో ఈ సినిమాలో నటించనున్నారనే టాక్ కూడా వినిపిస్తున్నది.

# కాంబినేషన్ సెట్?



నాగచైతన్య హీరోగా నటించిన తాజా సినిమా 'వృషకర్మ'. నాగచైతన్య కెరీర్‌లోని ఈ 24వ చిత్రం డిసెంబరులో విడుదల కానుందట. 'వృషకర్మ' తర్వాత నాగచైతన్య హీరోగా నటించబోయే సినిమాకు క్లాక్స్, బోయపాటి శ్రీను, శివ నిర్వాణ, పీఎస్ మిత్రన్ వంటి దర్శకుల పేర్లు వినిపించినప్పటికీ ఎవరూ ఫైనలైజ్ కాలేదు. తాజాగా దర్శకుడు వెంకీ అట్లూరి పేరు తెరపైకి వచ్చింది. 'సార్, లక్కీభాస్కర్, విశ్వనాథ్ అండ్ సన్స్ '.. ఇలా వరుస హిట్ చిత్రాలతో దూసుకెళుతోన్న వెంకీ అట్లూరి డైరెక్షన్ లో నాగచైతన్య ఓ సినిమా చేయనున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే.. నాగచైతన్య 25వ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ వెంకీ అట్లూరికి లభించినట్లే. మరి.. ఈ కాంబినేషన్ సెట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఈ సంగతి ఇలా ఉంచితే... నాగచైతన్యతో తాను ఎప్పుడో ఒక సినిమా చేయాల్సిందని, తన డైరెక్షన్ లో వచ్చిన కొన్ని సినిమాల కథలను నాగచైతన్యకు వినిపించానని, వివిధ కారణాల వల్ల సినిమా చేయడం కుదర్లేదని గతంలో ఓ ఇంటర్వ్యూలో వెంకీ అట్లూరి పేర్కొన్నారు.